
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కర్నూలు

జిల్లా వార్తలు 5

బుధవారం 11 జూన్ 2025



తుంగభద్రపై గుండ్రేవుల 'జల'ఆశయం సిద్ధిస్తే రెండు తెలుగు రాష్ట్రాలకు జలవారధి ఏర్పడుతుంది. కరువు పరిస్థితులకు అడ్డుకట్ట వేసేందుకు గుండ్రేవుల జలాశయం నిర్మాణం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ మేరకు కృష్ణా నది యాజమాన్య బోర్డుకు (కేఆర్ఎంబీ), తెలంగాణ ప్రభుత్వానికి లేఖ రాశారు. తెలంగాణ కూడా సానుకూలంగా ఉంది. ఈ క్రమంలో జలాశయం సామర్థ్యం 52.5 టీఎంసీలకు పెంచాలనే ప్రతిపాదన కూడా తెరపైకి వచ్చింది. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి చర్చలు జరిపితే ఈ ప్రాజెక్టు నిర్మాణం ఓ కొలిక్కి వస్తుందని సాగునీటి నిపుణులు పేర్కొంటున్నారు. నేడు జిల్లా ఇన్‌చార్జి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జిల్లాకు వస్తున్న సందర్భంగా గుండ్రేవుల జలాశయంపై ప్రత్యేక కథనం.



గుండ్రేవుల నిర్మాణానికి ప్రతిపాదించిన తుంగభద్ర నది ప్రాంతం

తెలుగు రాష్ట్రాల గుండెరేవుల..!

- 52.5 టీఎంసీలకు పెంచాలని ఆలోచన
- తెలంగాణ కూడా గుండ్రేవులకు సానుకూలం
- నేడు జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు
- జలాశయంపై స్పందించాలని పలువురి కోరిక

కర్నూలు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ద్వారా ఏటా 135 నుంచి 150 టీఎంసీలకు పైగా వరద జలాలు కృష్ణాలో కలసి కడలిపాలు అవుతున్నాయి. బచావత్ అవార్డు (కేడబ్ల్యూడీటీ-1) మేరకు కర్నూలు-కడప (కేసీ) కాలువకు 39.90 టీఎంసీలు కేటాయించారు. కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల్లో కేసీ కాలువ కింద 2,65,628 ఎకరాలకు సాగు, కర్నూలు నగరం సహా పలు పట్టణాలు, గ్రామాలకు తాగునీరు ఇవ్వాల్సి ఉంది. నికర జలాలు ఉన్నా.. నిల్వ చేసుకునే జలాశయం లేదు. కేసీ కెనాల్‌కు నీటిని మళ్లించే సుంకేసుల బ్యారేజీ సామర్థ్యం కేవలం 1.20 టీఎంసీలు మాత్రమే. తుంగభద్ర డ్యాంలో 10 టీఎంసీలు నిల్వ చేసి వేసవిలో తీసుకోవచ్చు. అయితే దాదాపు 200 కిలోమీటర్లు ప్రవహించి సుంకేసుల బ్యారేజీకి చేరాలంటే వాటా జలాల్లో 25-30 శాతం కూడా దక్కే పరిస్థితి లేదు. గడ్డుకాలంలో సాగు, తాగునీటి కోసం కన్నీటి కష్టాలు తప్పడం లేదు. సుంకేసుల బ్యారేజీ ఎగువన సి.బెళగల్ మండలం గుండ్రేవుల వద్ద తుంగభద్రపై కేసీ వాటా జలాల్లో 20 టీఎంసీలు నిల్వ చేసుకునేలా గుండ్రేవుల జలాశయం నిర్మిస్తే కేసీ ఆయకట్టుతో పాటు ఎగువన కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో నీటి కష్టాలు తీరుతాయని సీమ సాగునీటి నిపుణుడు, రిటైర్డ్ ఈఈ సుబ్బరాయుడు సూచిస్తున్నారు. గుండ్రేవుల ప్రాజెక్టు రూపశిల్పిగా ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డికి ఈ మేరకు నివేదించడంతో సర్వే కోసం ప్రభుత్వం రూ.53 లక్షలు ఇచ్చింది. ఆర్వీ అసోసియేట్స్ సంస్థ సర్వే చేసి డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) ప్రభుత్వానికి పంపించింది.

చంద్రబాబు నిధులిస్తే.. జగన్ అటకెక్కించారు

2019 ఫిబ్రవరి 21న అప్పటి సీఎం చంద్రబాబు గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి రూ.2,890 కోట్లు నిధులు మంజూరు చేస్తూ జీవో ఆర్టీ నెంబరు.154 జారీచేశారు. మార్చిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి ఈ జలాశయంలో అంతర్ రాష్ట్ర సమస్య ఉందని అటకెక్కించింది.



గుండ్రేవుల నిర్మాణం కోసం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న అప్పటి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, కేంద్ర మాజీ మంత్రి కోట్ల (ఫైల్)

రెండు రాష్ట్రాలకు జల ప్రయోజనం

గుండ్రేవుల జలాశయం 52.5 టీఎంసీలకు పెంచాలని ప్రతిపాదన తెరపైకి వచ్చింది. తుంగభద్ర నుంచి తెలంగాణ రాష్ట్రానికి ఆర్డీఎస్ ఎడమ కాలువ ద్వారా 15.6 టీఎంసీలు నికర జలాలు వాటా ఉంది. కర్ణాటక రాష్ట్రంలో సుమారు 50 కిలో మీటర్లు ప్రవహించాల్సి ఉండడంతో 5-6 టీఎంసీలు కూడా వాడుకునే పరిస్థితి లేదని ఆ రాష్ట్రానికి చెందిన ఆర్డీఎస్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ సీతారామిరెడ్డి పేర్కొంటున్నారు. దీంతో తెలంగాణ కూడా 15 టీఎంసీలు వాడుకోవడానికి వీలుగా గుండ్రేవుల సామర్థ్యం 35 టీఎంసీలకు పెంచాలని ఆ రాష్ట్రం ప్రతిపాదించినట్లు సమాచారం. ఉమ్మడి కర్నూలు జిల్లా నీటి అవసరాల దృష్ట్యా 52.5 టీఎంసీలకు పెంచితే, ఏపీ 34.5 టీఎంసీలు, తెలంగాణ 13-14 టీఎంసీలు, కర్ణాటకకు 4.5 టీఎంసీలు ఇచ్చే అవకాశం ఉంది. తెలంగాణ సైతం సానుకూలంగా ఉండడంతో ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. గుండ్రేవుల సామర్థ్యం 52.5 టీఎంసీలకు పెంచేందుకు సాధ్యసాధ్యాలపై ప్రాజెక్టు రూపకర్త, రిటైర్డ్ ఈఈ సుబ్బరాయుడు ప్రభుత్వానికి మరో లేఖ రాస్తున్నారు. నేడు జిల్లా పర్యటనకు వస్తున్న జిల్లా ఇన్‌చార్జి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దీనిపై స్పష్టమైన ప్రకటన చేయాలని పలువురు కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వం రావడంతో కదలిక

తిరిగి కూటమి ప్రభుత్వం రావడంతో గుండ్రేవుల జలాశయం ఫైల్ కదిలింది. మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు, పాణ్యం ఎమ్మెల్యేలు బొగ్గుల దస్తగిరి, గౌరు చరితమ్మలు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, జిల్లా ఇన్‌చార్జి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లారు. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) మార్గదర్శకాల ప్రకారం రూ.4,530 కోట్లు గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి కావాలని ఈ ఏడాది జనవరి 7న ఉమ్మడి జిల్లా ప్రాజెక్ట్ సీఈ కబీర్‌బాషా ప్రభుత్వానికి సమగ్ర వివరాలతో నివేదిక పంపారు. కేఆర్ఎంబీ, తెలంగాణ ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసినట్లు తెలుస్తోంది.



70 శాతం హామీలు అమలు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడాది కాలంలో 70 శాతం హామీలను అమలు చేసిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. మంగళవారం కర్నూలు నగరంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రూ.10లక్షల కోట్ల రుణం చేసి ప్రజలపై పెనుభారాన్ని మోపిందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో కూరుకుపోయేలా జగన్ పాలన సాగిందన్నారు. రాష్ట్రం దివాళా తీసే పరిస్థితిలో ఉన్న రాష్ట్రాన్ని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం గాడిలో పెడుతోందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు తన అనుభవం, కఠోర కష్టంతో తొలి ఏడాదిలోనే 70 శాతానికి పైగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. ఈస్థాయిలో గతంలో ఏ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుచేసి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించడం, సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించకుండా ఎస్సీ, ఎస్టీ బీసీ వర్గాలకు ఉపాధి కల్పించడం, ఎస్సీ వర్గీకరణ అమలు, నాయీబ్రహ్మణుల వేతనాలు రూ.25 వేలు పెంచామన్నారు.

నేడు జిల్లాకు మంత్రి నిమ్మల



కర్నూలు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు బుధవారం జిల్లాకు రానున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం రాత్రి 7:25 గంటలకు విజయవాడ నుంచి రైలు మార్గాన బయల్దేరుతారు. బుధవారం తెల్లవారుజామున 3:03 గంటలకు డోన్ చేరుకుంటారు. అక్కడి నుంచి బయలుదేరి 4 గంటలకు కర్నూలు లోని రోడ్లు, భవనాలు శాఖ అతిథిగృహానికి చేరుకుంటారు. రూ.22 కోట్లతో నిర్మించిన కె.నాగులాపురం-నన్నూరు రోడ్డును తడకనపల్లెలో ప్రారంభిస్తారు. అక్కడ జరిగే సమావేశంలో పాల్గొంటారు. రాత్రి 8 గంటలకు డోన్ చేరుకుని అక్కడి నుంచి రైలులో విజయవాడకు బయలుదేరుతారు.

పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి

కర్నూలు కలెక్టరేట్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలోని 16మంది పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు ఇచ్చినట్లు కర్నూలు జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ తెలిపారు. 11 మంది గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులలో 9 మందికి రెగ్యులర్ ప్రమోషన్, ఇద్దరికి అడ్‌హక్ ప్రమోషన్, 4 గ్రామ పంచాయతీ సిబ్బందికి, డీపీవో కార్యాలయం సిబ్బందిలో ఒకరికి పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-3 ప్రమోషన్ కల్పించినట్లు తెలిపారు.

జనాభా నిర్వహణ విధానంపై సర్వే: కలెక్టర్



కర్నూలు కలెక్టరేట్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు తరాలకు మంచి సమాజాన్ని అందించేందుకు ప్రత్యేకమైన జనాభా నిర్వహణ విధానం రూపొందించేందుకు సర్వే నిర్వహిస్తామని కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జనాభా నిర్వహణ విధానం (పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ-2025)పై జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, స్టాటిస్టికల్ ఆఫీసర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో జనాభా నిర్వహణ విధానం చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం డ్రాఫ్ట్ పేపర్‌ను విడుదల చేశారన్నారు. సాధారణంగా జనాభా పెరుగుదల, తగ్గుదలలో వివిధ రకాల కారణాలు ఉంటాయన్నారు. 2025లో భారతదేశంలో 141కోట్ల జనాభా ఉందని, ఇదే బర్త్ రేట్‌తో కొనసాగినట్లయితే 2061 సంవత్సరంలో 165కోట్ల జనాభా ఉంటుందన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా క్యూఆర్ కోడ్ ద్వారా 9 ప్రశ్నలు ఇవ్వడం జరిగిందని, వాటి ద్వారా ప్రజల నుంచి అభిప్రాయలను సేకరించాలని ఎంపీడీవోలను ఆదేశించారు. కార్యక్రమంలో కర్నూలు నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు, ఇన్‌చార్జి డీఆర్వో వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో శాంతికళ, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ హిమప్రభాకర్ రాజు, ఐసీడీఎస్ పీడీ నిర్మల, సెట్కూరు సీఈవో వేణుగోపాల్, పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్, మెప్మా పీడీ నాగశివలీల, టూరిజం అధికారి విజయ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాఖలో బదిలీలకు కసరత్తు

కర్నూలు హాస్పిటల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్య శాఖలో జిల్లా క్యాడర్ల బదిలీలకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన జరిగే బదిలీల ప్రక్రియ వేగవంతమైంది. జిల్లా క్యాడర్లకు సంబంధించిన ఉద్యోగుల బదిలీల జాబితాను సిద్ధం చేస్తున్నారు. నంద్యాల జిల్లా నుంచి జాబితాను కొద్దిగా ఆలస్యంగా రావడంతో రెండు జిల్లాలతో కలుపుకుని ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలను పాటిస్తూ ఉద్యోగుల బదిలీలు నిర్వహించనున్నారు. డీఎంహెచ్‌వో పరిధిలోని 12 క్యాడర్లకు సంబంధించిన బదిలీల దరఖాస్తు జాబితా ఐదేళ్ల సీనియారిటీ జాబితా, క్లియర్ వేకెన్సీ లిస్టును బుధవారం ప్రకటించే అవకాశం ఉందని అధికారులు తెలియజేశారు. రీడిప్లాయ్‌మెంటు కింద పని చేస్తున్న 15 మంది ఏఎన్ఎం బదిలీలు వద్దని తమ దరఖాస్తులను వెనక్కు తీసుకున్నారు. ఉద్యోగుల జాబితా అనంతరం 13, 14, 15 గ్రీవెన్స్ ఏర్పాటు చేసి ఫైనల్ లిస్టు విడుదల చేసి బదిలీలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

నేడు నంద్యాలకు వైఎస్ షర్మిల



6

ఇంజనీరింగ్ అధికారుల బదిలీలు

నిర్జీవమవుతున్న నేల 6

- రసాయనాలతో సారం కోల్పోతున్న భూమి
- పెరిగిన రసాయన ఎరువుల వాడకం

వైద్యారోగ్య శాఖలో అవినీతి దందా కొనసాగుతోంది. ఈ శాఖలో పనిచేస్తున్న ఓ ఉన్నతాధికారి.. మరో ముగ్గురు అధికారులతో కలిసి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడు. ప్రతి పనికో రేటుతో అక్రమార్జనకు తెర తీశాడు. ఉద్యోగులు, వైద్యులు ఈ నలుగురి తీరుతో బెంబేలెత్తిపోతున్నారు. ఏ పని కావాలన్న అమ్యామ్యాలు సమర్పించుకోవాల్సిన దుస్థితి నెలకొందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరైతే పోతే పోయింది అనుకొని వారు చెప్పినంత సమర్పించుకొని పనులు చేయించుకుంటున్నారు. వైద్యులు పీజీ చేయాలన్నా, సెలవులు కావాలన్నా, ఇంకే పని కావాలన్నా డబ్బులు ఇవ్వాల్సిందే. లేదంటే పనులు సాగవు. వైద్యారోగ్య శాఖలో ఇలాంటి అవినీతి గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం జరుగుతున్నా బదిలీల్లో ఆ నలుగురు వేరే ప్రాంతాలకు వెళ్లి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.



ఆపరేషన్ అవినీతి

అక్రమ దందాకు కేరాఫ్‌గా వైద్యారోగ్య శాఖ

- ప్రతి పనికి ఓ రేటు
- భారీగా అక్రమ వసూళ్లు
- మూడేళ్ల నుంచి గుట్టుగా సాగుతున్న వ్యవహారం
- సెలవుల్లో ఉండి వేతనాలు డ్రా
- పేమెంట్ చేస్తేనే పీజీకి అనుమతి
- ఫేస్ బయోమెట్రిక్ అప్రూవల్‌కూ మామూళ్లు
- ఓ ఉన్నతాధికారి, ముగ్గురు అధికారులే కీలకం
- రూ. కోట్లలో అక్రమ దందా
- బదిలీలతో తప్పించుకునే పన్నాగం?

నంద్యాల, జూన్ 10(ఆంధ్రజ్యోతి): వైద్యారోగ్య శాఖ అంటేనే ఎంతో కీలకమైనది. నంద్యాల జిల్లా వైద్యారోగ్య శాఖలో మాత్రం ఆపరేషన్ 'అవినీతి' కొనసాగుతోంది. ఆ శాఖపై పలు అవినీతి ఆరోపణలు గుప్పుమంటున్నాయి. పైసలిస్తే తప్ప ఏ పనిచేయడం లేదనేది బాధిత వర్గాల ఆవేదన. ఫేస్ బయోమెట్రిక్ నుంచి అక్రమ డిప్యుటేషన్లు, అడ్డగోలు సెలవుల వ్యవహారం వరకు ఎక్కడిక్కడ ప్రతి పనికో రేటు పెట్టి అక్రమ వసూళ్లకు తెరలేపారనే విమర్శలు లేకపోలేదు. ఎవరైనా వైద్యులు పీజీకి వెళ్లాలన్నా.. విధుల్లో చేరే సమయంలో వారి ధ్రువపత్రాలను వెరిఫికేషన్‌కు పంపాలన్నా.. ఏదైనా సెలవులు మంజూరు చేయాలన్నా.. పైసలిస్తే తప్ప పనిచేయడం లేదనే విమర్శలు లేకపోలేదు. మొత్తంగా ఈ వ్యహారంలో ఆశాఖ ఉన్నతాధికారితో పాటు కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ముగ్గురు అధికారులు పాత్ర కీలకంగా ఉన్నట్లు ఆశాఖ వర్గాల నుంచి తెలిసింది. వీరిలో కొందరైతే మరీ దారుణం. ఏకం గా ఫోన్‌పేకు డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటున్నారు. ఒక్కమాటలో చెప్పా లంటే.. జిల్లా వైద్యఆరోగ్యశాఖలో పలు రూపాల్లో అక్రమ దందా రూ. కోట్లలో సాగుతోందని విమర్శలు లేకపోలేదు.

తనదైన శైలిలో ఎవరికీ చిక్కకుండా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఉద్యోగులకు డిప్యుటేషన్ సదుపాయం లేకుండా చేశారు. కానీ.. ఇక్కడ ఆ శాఖ ఉన్నతాధికారి మాత్రం తనదైన శైలిలో ఎవరికీ చిక్కకుండా మూడేళ్లుగా అక్రమ వ్యవహారం సాగిస్తున్నారని తెలిసింది. వైద్యులు, ఉద్యోగులకు మౌఖికంగా (ఓరల్) అక్రమ డిప్యుటేషన్లు వేస్తున్నట్లు, హోదాను బట్టి వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. ఇదే క్రమంలో కొందరు వైద్యులు, ఉద్యోగులు సైతం అడ్డదారిలో సెలవులు పొంది విధులకు వెళ్లకుండానే వేతనాలు డ్రా చేశారనే ఆరోపణలు లేకపోలేదు. ఈ నేపథ్యంలో సదరు అధికారికి ఆయా ఉద్యోగులు భారీగా నెలవారి మాముళ్లు అందజేస్తున్నారనే ప్రచారం లేకపోలేదు. ఇదిలా ఉండగా.. జిల్లాలోని రెండు పీహెచ్‌సీలో డీడీవో పవర్ ఉన్న వైద్యులు.. అక్రమంగా జీతం పొందిన వైద్యులు, ఉద్యోగుల మధ్య వాగ్వాదం జరిగినా సదరు ఉన్నతాధికారి చూసీచూడనట్లు వ్యవహరించి అక్రమార్కులకు అండగా నిలిచారనే ఆరోపణలున్నాయి.

డీడీవో ఓకే చేసిన వారికే అప్రూవల్ చేయాలి

జిల్లాలోని ప్రతి పీహెచ్‌సీలో ఒక డీడీవో (వైద్యులు) ఉంటారు. అక్కడ పనిచేస్తున్న మిగతా వైద్యులతో పాటు వైద్యఉద్యోగులు, సిబ్బందికి సంబంధించి ప్రతిరోజు వారు వేసిన ఫేస్ బయోమెట్రిక్‌లు తమ పరిధిలో వేసి ఉంటేనే ఓకే చేయాలి. ఆ తర్వాత జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఉన్న పర్యవేక్షణాధికారి(వైద్యులు) డీడీవో ఓకే చేసినా వారికి మాత్రమే (అప్రూవల్) చేయాల్సి ఉంది. కానీ.. సదరు పర్యవేక్షణాధికారి డీడీవో అప్రూవల్ చేయకపోయినా తానే అప్రూవల్ చేసి ఆయా ఉద్యోగుల నుంచి నెలవారిగా మామూళ్ల దండుకుంటున్నారని కొందరు డీడీవో వైద్యుల ద్వారా తెలిసింది.

మిగతా 6వ పేజీలో

ఇంజనీరింగ్ అధికారుల బదిలీలు

ఐదేళ్లు కాకుండానే స్థాన చలనం

కర్నూలు న్యూసిటీ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని నగరపాలక, మున్సిపాలిటీ, నగర పంచాయతీల్లో పనిచేస్తున్న ఇంజనీర్లను బదిలీ చేస్తూ చీఫ్ ఇంజనీర్ ఎం. ప్రభాకర్‌రావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాయలసీమలోని అనంతపురం, కడప, చిత్తూరు, కర్నూలు జిల్లాలకు సంబంధించి డీఈఈ, ఏఈఈలకు సాధారణ బదిలీలు నిర్వహించారు. ప్రధానంగా డీఈఈ శ్రీనివాసరెడ్డి గత సంవత్సరం జరిగిన బదిలీల్లో భాగంగా కర్నూలు కార్పొరేషన్‌కు వచ్చారు. అయితే ఏడాది తిరగకముందే ఆయనను బదిలీ చేయడం చర్చనీయాంశమైంది. అదే విధంగా ఆదోని మున్సిపాలిటీలో పని చేస్తున్న జనార్దన్ కూడా గతేడాది నగరపాలక నుంచి ఆదోనికి వెళ్లారు. అయితే మరోసారి సాధారణ బదిలీల్లో సంవత్సరం కాక ముందే నగరపాలక సంస్థకు రావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారిలో డీఈఈ, ఏఈఈలు నగర పాలక సంస్థలో ఎవరూ లేరు. ప్రజాప్రతినిధులు సిఫారసుల మేరకు కావాల్సిన వారిని బదిలీ చేసినట్లు సమాచారం.

డీఈఈలు

పేరు	ప్రస్తుతం	బదిలీ
ఆర్. రాజశేఖర్	ఆదోని మున్సిపాలిటీ	ఏపీ టిడ్కో, విజయవాడ
జి. శ్రీనివాసరెడ్డి	కార్పొరేషన్, కర్నూలు	పులివెందుల మున్సిపాలిటీ
కే. చంద్రయ్య	పులివెందుల మున్సిపాలిటీ	నంద్యాల డీపీహెచ్ఈవో
ఎస్. కావ్య	నంద్యాల డీపీహెచ్ఈవో	కడప పబ్లిక్ హెల్త్ డివిజన్
జి.వి. వరప్రసాద్	పబ్లిక్ హెల్త్ డివిజన్, కడప	ఎమ్మిగనూరు మున్సిపాలిటీ
జి. విక్టర్‌బాబు	ఎమ్మిగనూరు మున్సిపాలిటీ	ఏపీ టిడ్కో, కర్నూలు

ఏఈఈలు

పేరు	ప్రస్తుతం	బదిలీ
ఎస్. భార్గవి	కార్పొరేషన్, కర్నూలు	ఆదోని మున్సిపాలిటీ
కే. జనార్దన్	ఆదోని మున్సిపాలిటీ	కార్పొరేషన్, కర్నూలు
వి. నాగజ్యోతి	కార్పొరేషన్, కర్నూలు	తిరుపతి కార్పొరేషన్
కే. గోవిందప్ప	కార్పొరేషన్, కర్నూలు	గుత్తి మున్సిపాలిటీ
ఈ. ప్రవీణ్‌కుమార్	కార్పొరేషన్, కర్నూలు	కడప కార్పొరేషన్
వి. అంజలి	కడప కార్పొరేషన్	కార్పొరేషన్, కర్నూలు
బి. బ్యూలా	ప్రొద్దుటూరు మున్సిపాలిటీ	ఆదోని మున్సిపాలిటీ
యు. శ్రీనివాస్	డీపీహెచ్ఈవో, నంద్యాల	పబ్లిక్ హెల్త్, గుంతకల్లు

జడ్పీ పరిధిలో 9 మంది బదిలీ

కర్నూలు న్యూసిటీ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పరిధిలో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులు 9మందిని బదిలీచేస్తూ జడ్పీ సీఈవో నాసరరెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు ఇద్దరు ఎంపీడీవోలు, ఇద్దరు పరిపాలనా అధికారులు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, ఒక రికార్డు అసిస్టెంటు, ఒక నాలుగో తరగతి ఉద్యోగిని బదిలీ చేయడంతో పాటు, ఒక టైపిస్టును అదే స్థానంలో కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నగర పాలక సంస్థలో ఆడిటర్ మురళి బదిలీ: నగర పాలక సంస్థలో పని చేస్తున్న ఆడిటర్ మురళిని తిరుపతి శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీకి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వీరు వెంటనే బదిలీ స్థానాల్లో చేరాలని పేర్కొన్నారు.

ఎక్సైజ్ శాఖలో సీఐలు..

కర్నూలు అర్బన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్‌శాఖలో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల పరిధిలో ఏడుగురు సీఐలను బదిలీ చేశారు. మంగళవారం రాత్రి డిప్యూటీ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈక్రమంలో రాయలసీమ జిల్లాల్లో పనిచేస్తూ ఉమ్మడి కర్నూలు జిల్లాకు డి.మునిస్వామిని పంచలింగాల చెక్‌పోస్టుకు , టీఎస్ ప్రసాదరావును మాధవవరం చెక్ పోస్టుకు, వి.విజయకుమార్‌ని ఆళ్లగడ్డకు, డి విశ్వేశ్వరరావును పంచలింగాల చెక్‌పోస్టుకు, ఆర్. స్వర్ణలతని పత్తికొండకు, ఈ. మోహన్‌రెడ్డిని ఆత్మకూరుకు, వై.సతీష్‌ని బనగానపల్లెకి బదిలీపై నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు

నేడు నంద్యాలకు వైఎస్ షర్మిల

- రేపు నాయకులు, కార్యకర్తలతో సమావేశం
- డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్



కల్యాణ మండపాన్ని పరిశీలిస్తున్న లక్ష్మీనరసింహయాదవ్

నంద్యాల రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల బుధవారం నంద్యాలకు రానున్నట్లు డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్ పేర్కొన్నారు. నంద్యాల మండలంలోని చాబోలు గ్రామ సమీపంలో షర్మిల బస చేయనున్న ఎయస్ఆర్ కల్యాణ మండపాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం సూరజ్ గ్రాండ్ హోటల్‌లో ముఖ్యనాయకులు, కార్యకర్తలతో పాల్గొనేందుకు అన్నిరకాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షర్మిల బుధవారం సాయంత్రం 6 గంటలకు కర్నూలులో బయలుదేరి ఓర్వకల్లు, పాణ్యం మీదుగా నంద్యాల సమీపంలోని ఎయస్ఆర్ కల్యాణ మండపానికి చేరుకుని అక్కడే రాత్రికి బస చేయనున్నట్లు తెలిపారు. 12వ తేదీ ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు సూరజ్‌గ్రాండ్ హోటల్‌లో కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహిస్తారన్నారు. షర్మిల పర్యటనను విజయవంతం చేయాలని ఆయన కోరారు. నంద్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి చాకలి పుల్లయ్య, పట్టణాధ్యక్షుడు దాసరి చింతలయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సలీం, నంద్యాల పార్లమెంట్ ఉపాధ్యక్షుడు అబ్రహం పఠాన్ సలీం, ఖాజా శ్రీను, రాజు పాల్గొన్నారు.



నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పంచభూతాల్లో ఒకటైన ప్రకృతిని దైవంగా ఆరాధించడం మన సంప్రదాయం. మన సంస్కృతికి, జీవన విధానానికి వ్యవసాయం మూలస్తంభం లాంటిది. నాగరికత ఎంత ముందుకు సాగుతున్నా రైతుకు నాగలి లేనిదే మనుగడ లేదు. ప్రకృతిని దైవంగా భావించి ఆరాధించడం, వ్యవసాయ పనుల ఆరంభానికి ముందు పూజ చేయడం అనాదిగా వస్తున్న ఆచారం. జ్యేష్ఠ పౌర్ణమి రోజున వచ్చే రైతు పండుగయే ఏరువాక పౌర్ణమి. ఏరు అంటే నాగలి, వాక అంటే దున్నడం అని అర్థం. జ్యేష్ఠ పూర్ణిమ(ఏరువాక పూర్ణిమ) రోజున వ్యవసాయ పనులు ప్రారంభించేందుకు ముందుగా ఎడ్లను కడిగి కొమ్ములకు రంగులు వేసి వాటిని అందంగా అలంకరించి పూజిస్తారు. అనంతరం నాగలితో పొలంలోకి వెళ్లి దుక్కిని ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోంది.

ఏరువాక సాగాలో..

- మన సంస్కృతి, జీవన విధానానికి మూలస్తంభం వ్యవసాయం
- ఏరువాకతో యజ్ఞంలా వ్యవసాయ పనులు ఆరంభం
- నాగరికతకు చిహ్నంగా 'నాగలి'
- రైతు పండుగగా గుర్తింపు
- నేడు ఏరువాక పౌర్ణమి

నైరుతి రుతుపవనాల రాకతో...

ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే రావడం, వర్షాలు కురవడంతో భూములు పదునెక్కాయి. దీంతో ఏరువాక పౌర్ణమి కోసం రైతులు ఎదురు చూస్తూ విత్తనాలు వేసేందుకు సిద్ధమయ్యారు. తొలకరి జల్లుల ఆగమనంతో రైతులు ఆనందోత్సాహాలతో అరక దున్ని వ్యవసాయ పనులు పెట్టారు. నాగలిని ధైర్యానికి, కష్టపడే మనస్తత్వానికి ప్రతీకగా, ఎద్దులు, ఇతర పనిముట్లు రైతు శక్తిసామర్థ్యాలను నైపుణ్యానికి చిహ్నాలుగా భావిస్తారు.

వృషభ పూజ

ఏరువాక పున్నమిని వృషభ పూజగా కూడా పిలుస్తారు. పాలిచ్చే గోవులకు పసుపు, కుంకుమతో పూజించడం, పనిచేసే బసవన్నకు పత్రి, పుష్పం సమర్పించి, అందంగా అలంకరించి హారతులు పట్టడం మన సంస్కృతిలో భాగంగా వస్తోంది. తొలిదుక్కి సమయంలో రైతులు కాడికి ఒక పక్కన ఉంటూ ఎద్దులతో సమానంగా నడుస్తారు. తమ జీవనంలో కూడా తమకు అండగా ఉంటున్న మూగజీవాల పట్ల అభిమానాన్ని చాటుతారు. పశువులతో ఊరేగింపులు నిర్వహించడం, ఆలయాల ప్రదక్షిణ చేయించడం చాలా చోట్ల ఆనవాయితీగా వస్తోంది.



క్రీడలతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

- క్రీడలంటే ఎంతో ఇష్టం
- ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు క్రీడల్లో రాణిస్తే వాటి ద్వారా వచ్చే ప్రశంసాపత్రాలతో విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఎస్‌ఏపీ క్యాంపులో ఏర్పాటు చేసిన వేసవి బాస్కెట్‌బాల్ శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏపీఎస్‌పీ సెకండ్ బెటాలియన్ కమాండెంట్ దీపిక పాటిల్‌తో కలిసి ఆయన గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే మంచి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. తనకు క్రీడలు అంటే ఎంతో ఇష్టమని తెలిపారు. బాలుర విభాగంలో ఈగల్ జట్టు గెలుపొందగా బాలికల విభాగంలో లేకర్స్ జట్టు విజయం సాధించింది. బాలుర జట్టులో ద్వితీయ స్థానంలో బుల్స్ నిలవగా.. బాలికల విభాగంలో ద్వితీయ స్థానంలో హాప్‌స్టార్ జట్లు నిలిచాయని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు దాదాబాషా, ముస్తాహీర్‌బాషా తెలిపారు. కార్యక్రమంలో శిక్షకులు పాండురంగారావు, వినయ్‌రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎస్పీ దంపతులు

ఎన్‌సీసీతో క్రమశిక్షణ

కర్నూలు గ్రూప్ కమాండర్ కల్నల్ డీఎస్ ఫీటర్స్



ఎన్‌సీసీ కేడెట్స్‌కు సూచనలిస్తున్న కల్నల్ డీఎస్ ఫీటర్స్

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ శిక్షణతో క్రమశిక్షణ అలవడుతుందని ఆ సంస్థ కర్నూలు గ్రూప్ కమాండర్ కల్నల్ డీఎస్ ఫీటర్స్ అన్నారు. కర్నూలులోని 28(ఏ) ఎన్‌సీసీ బెటాలియన్ ఆధ్వర్యంలో క్యాంప్ నిర్వహిస్తున్నారు. నంద్యాల, కర్నూలు జిల్లాలోని వివిధ విద్యాసంస్థల నుంచి దాదాపు 550 మంది కేడెట్స్ హాజరయ్యారు. 10రోజులపాటు నిర్వహించే ఈ క్యాంపును సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కాలేజీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీతో క్రమశిక్షణ, స్నేహభావం కలుగుతుందని అన్నారు. కల్నల్ బీఎస్ ప్రసాద్, లెఫ్టినెంట్ కల్నల్ జి.శశికుమార్, సహాయ కమాండెంట్ ఆఫీసర్లు రఘురాం, కామ్మీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిర్జీవమవుతున్న నేల

- రసాయనాలతో సారం కోల్పోతున్న భూమి
- పెరిగిన రసాయన ఎరువుల వాడకం
- అవగాహనలేమితో నష్టపోతున్న రైతులు
- పట్టించుకోని వ్యవసాయశాఖ



సహజత్వాన్ని కోల్పోయి తెల్లబారుతున్న నేలలు

కొలిమిగుండ్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : గేదెల పేడ .. మేకల ఎరువు .. నల్లమట్టి .. కోళ్లపెంట .. కుళ్లిన మొక్కలు .. ఇలాంటి సేంద్రియ ఎరువులే ఒకప్పుడు పంటల సాగులో ప్రధానంగా ఉండేవి. భూముల్లో సేంద్రియ కర్బనం ఉత్పత్తి ఎక్కువగా ఉండేది. కార్బన్-నత్రజని 1:4 శాతంలో సమతుల్యతగా ఉండేది. జీవసంబంధమైన వానపాము, సాలెపురుగు, అరిద్రపురుగు, కందిరీగ, తూనిగ, సీతాకోకచిలుక, రైజోబీయం బ్యాక్టీరియా తదితర అనేక జీవులు భూమిలో భూసారాన్ని వృద్ధి చేయడంతో పాటు, మొక్కలపై జీవిస్తూ పంటలను చీడపీడలబారి నుంచి సంరక్షిస్తూ తోడ్పాటునందించేవి. అధిక పోషక విలువలతో పంట దిగుబడి బాగా ఉండేది. కానీ నేడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. పెరుగుతున్న జనాభా కనుగుణంగా ఆహార పంటల ఉత్పత్తి పెంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధిక దిగుబడే ప్రధాన లక్ష్యంగా రసాయన ఎరువుల ప్రాధాన్యం పెరిగింది. దీంతో సేంద్రియ ఎరువుల వాడకం పూర్తిగా తగ్గిపోయింది. మోతాదుకు మించి రసాయన ఎరువుల వాడకం పెరగడంతో భూమిలో సేంద్రియ కర్బనం తగ్గిపోయింది. నేల నిర్జీవమవుతోంది. ఫలితంగా వ్యవసాయం గాడి తప్పింది. రైతులకు అవగాహన కల్పించి నష్ట నివారణ చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ఏళ్ల తరబడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయాన్ని పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. భవిష్యత్తులో వ్యవసాయమే ప్రశ్నార్థకంగా మారే పరిస్థితులు నెలకొంటాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

సేంద్రియ సాగుపై అవగాహన ఎక్కడ..?

వ్యవసాయంలో సేంద్రియ ఎరువుల వాడకం పెంచి, పెట్టుబడి ఖర్చులు తగ్గించాలని ప్రభుత్వాలు పలు కార్యక్రమాలు చేపడుతున్నా ఫలితం కానరావడం లేదు. పొలంబడి, రైతు చైతన్యయాత్రలు, సాగుకు సమాయత్తం, రైతు భరోసా కేంద్రాలు, రైతు అవగాహన సదస్సులు మొదలైన వాటిని అధికారులు మొక్కుబడిగా ముగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రభుత్వాల నిర్దేశిత లక్ష్యాలు ఏమాత్రం నెరవేరడం లేదు. ఉమ్మడి జిల్లాలో నేటికీ 20 శాతం మంది రైతులు కూడా భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేయడంలేదంటే పరిస్థితి ఎంత దయనీయంగా వుందో అర్థమవుతోంది. కొంత మంది రైతులు అరకొరగా మాత్రమే పశువుల పేడ, నల్లమట్టి లాంటి సేంద్రియ ఎరువులు వాడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని రైతులకు సేంద్రియ ఎరువులపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం వుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రసాయన ఎరువులతో నష్టాలు: అతిగా రసాయన ఎరువుల వాడటం వల్ల కాలక్రమేణా మేలు చేసే సూక్ష్మజీవులు అంతరించి పోతున్నాయి. తద్వారా దుష్ఫలితాలు కలుగుతున్నాయి. పంటలకు చీడపీడలు వ్యాపించి, పండే పంటలు సైతం కలుషితంగా మారుతున్నాయి. ఇలాగే రసాయన ఎరువుల వాడకం పెరిగితే భవిష్యత్తులో భూములు వ్యవసాయానికి పనికి రాకుండా పోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సేంద్రియ ఎరువులతో లాభాలు: సేంద్రియ ఎరువుల వల్ల నేలలు సహజత్వాన్ని కోల్పోవు. నేల ఉత్పాదకతకు కావాల్సిన అనుకూల లక్షణాలు పెరుగుతాయి. మొక్కకు కావాల్సిన పోషకాలు పుష్కలంగా లభ్యమవుతాయి. పోషకాల సమతుల్యత దెబ్బతినదు. పలురకాల ఎంజైములు, హార్మోన్లు, అమైనో ఆమ్లాలు తయారై మొక్క చురుకుగా పెరుగుతుంది. తద్వారా నాణ్యమైన అధిక దిగుబడి వస్తుందని శాస్త్రవేత్తలు అంటున్నారు.



పొలంలో సేంద్రియ ఎరువు వేస్తున్న మహిళా రైతులు

ఆపరేషన్ అవినీతి



5వ పేజీ తరువాయి

దీంతో ఇదే అదునుగా భావించిన వైద్యులు, ఉద్యోగులు సైతం మామూళ్లు ఇస్తున్నాం కదా.. అని..? ఎక్కడపడితే అక్కడే ఫేస్ బయోమెట్రిక్ వేస్తున్నారు. ఎప్పుడు పడితే అప్పుడు విధులకు వెళ్లడం, కొన్ని సందర్భాల్లో అనుమతి లేకుండా డుమ్మా కొట్టడం చేస్తున్నారు. ఇంత చేస్తున్నా వారి జీతాల్లో మాత్రం కోతలు పడటం లేదు. ఈ రూపంలో కూడా నెలకు సదరు పర్యవేక్షణాధికారి ద్వారా ఆశాఖ ఉన్నతాధికారికి సైతం భారీగానే నెలవారీ మామూళ్లు ముడుతున్నాయని తెలుస్తోంది.

పైసలిస్తేనే రిలీవ్..

జిల్లా వైద్యఆరోగ్యశాఖలో పనిచేస్తున్న చాలా మంది వైద్యులు ఎంబీబీఎస్ చేసినవారే ఉన్నారు. ఈ నేపథ్యంలో కొందరు వైద్యులుకు పీజీలకు అవకాశం వస్తే.. ఇదే అదునుగా భావించిన సదరు అధికారులు పైసలిస్తే తప్ప.. ఆవైద్యులను విధుల నుంచి రిలీవ్ చేయలేదని పలువురు వాపోతున్నారు. మూడేళ్లలో జిల్లాలో సుమారు 45 మంది వైద్యులు పీజీకి వెళ్లినట్లు సమాచారం. వీరిలో ఒక్కొక్కరి నుంచి రూ. 40వేలు నుంచి రూ.50 వేలు వరకు వసూలు చేసినట్లు తెలిసింది. కొందరి నుంచి అక్కడ పనిచేస్తున్న ఓ అధికారికి చెందిన ఫోన్‌పే చేయించుకోవడం గమనార్హం. పెండింగ్ ఏరియర్స్, సర్వీస్ మ్యాటర్స్ తదితర విషయాల్లో సైతం సదరు అధికారి తమదైన శైలిలో వసూళ్లు చేసి క్యాష్ చేసుకుంటున్నారని సమాచారం. ఈ లావాదేవీల్లో సదరు ఉన్నతాధికారికి ఎక్కువశాతం వాటా చేరుతోందని తెలిసింది

స్థాయిని బట్టి..

ఉద్యోగుల పరంగా ఉద్యోగాన్ని బట్టి వారి ఎస్ఆర్‌ల కోసం రూ. 10 వేలు నుంచి రూ.20 వేలు. ఇదే క్రమంలో వివిధ వెరిఫికెషన్ రూపంలో ఒక్కొక్కరి నుంచి స్థాయిని బట్టి రూ.10వేల నుంచి రూ. 15వేలు వసూలు చేస్తున్నారని తెలిసింది. ఇప్పటికీ కొందరి ఎస్ఆర్‌లు సక్రమంగా లేవని తెలుస్తోంది. ఇదేతరహాలో మెటర్నిటీ లీవ్‌లకైతే రూ. 15వేలు సమర్పించాల్సిందే అనే చర్చ సాగుతోంది. క్యాజువల్ లీవ్‌కు సైతం వదలకుండా స్థాయిని బట్టి వసూళ్లు చేస్తున్నారని తెలిసింది. వీటికితోడు కొన్ని పీహెచ్‌సీలకు సంబంధించిన హెచ్‌డీఎఫ్ నిధులను సైతం పక్కదారి పట్టించి రూ.లక్షల్లో స్వాహా చేశారనే ఆరోపణలు లేకపోలేదు.

సార్ ఆదేశిస్తారు.. వారు అమలు చేస్తారు..

అక్రమ వసూళ్ల దందా వెనుక ఓ ఉన్నతాధికారితో పాటు అక్కడే పనిచేసే మరో ముగ్గురు అధికారులు పాత్ర కీలకంగా ఉందని ఆశాఖ వర్గాల నుంచి తెలిసింది. సార్ ఆదేశించడం.. వారు అమలుచేసి వచ్చిన అమ్యామ్యాలను గుట్టుచప్పుడుగా ఉన్నతాధికారికి చేరవేస్తున్నట్లు సమాచారం. ఎప్పుడైనా.. ఎవరైనా ఇవ్వకపోతే.. ఏదో రకమైన వనులు.. సమస్యల మీద కార్యాలయానికి పిలిపించడం.. ఆ తర్వాత ఆ ముగ్గురు కథ నడుపుతున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. వీరే కాకుండా జిల్లాలోని పీహెచ్‌సీలో పనిచేస్తున్న కొందరు యూడీసీల ద్వారా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు.

బదిలీల్లో తప్పించుకోవాలనే...

సదరు ఉన్నతాధికారితో పాటు కీలకంగా వ్యవహరించిన ముగ్గురు అధికారులు. సదరు వ్యవహారాలకు సహకరించిన ఉద్యోగులు సైతం భవిష్యత్‌లో సేఫ్‌గా ఉండాలనే యోచనతో తాజా బదిలీల రూపంలో ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎవరికి వారు తమదైన శైలిలో పైరవీలు మొదలెట్టినట్లు సమాచారం. ఇప్పటికైనా జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో మూడేళ్లుగా సాగిన అవినీతి ఆరోపణలపై ఆశాఖ రాష్ట్ర స్థాయి అధికారులు స్పందించి లోతుగా విచారణ చేస్తే.. సదరు అధికారులు అక్రమ దందా..! బయటపడే అవకాశం లేకపోలేదని సమాచారం.

ఉన్నతాధికారులు వస్తే హడావిడి..

తాను చేసిన వ్యవహారం ఏమాత్రం బయటపడకుండా తెరవెనుక కథ నడిపారని ఆశాఖ వర్గాల నుంచి తెలుస్తోంది. మూడేళ్లుగా అక్రమ వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలు ఆశాఖ వర్గాల్లో లేకపోలేదు. అక్రమ వ్యవహారం అంతా కూడా తమ వద్ద పనిచేస్తున్న ఆ ముగ్గురు కీలక అధికారుల ద్వారా నడిపించారనే విషయం స్పష్టంగా తెలుస్తోంది. ఆ ముగ్గురి అకౌంట్లతో పాటు ఫోన్ కాల్స్ రికార్డులను పరిశీలించినా అసలు విషయాలు బయటపడే అవకాశం ఉందని సమాచారం. లేదంటే పీజీల కోసం బయటకు వెళ్లిన వైద్యులు.. కొత్తగా విధుల్లో చేరిన వైద్యులు, వైద్య ఉద్యోగులను అడిగినా కూడా ఇట్టే తెలిసిపోతుంది. తాను చేసిన తప్పులు బయటకుండా ఆశాఖ ఉన్నతాధికారులు, మంత్రులు, కలెక్టర్లు వచ్చిన సమయంలో సదరు ఉన్నతాధికారి నానా హడావిడి(వివిధ రూపాల్లో) చేసి వారి నుంచి సమస్య తలెత్తకుండా చూసుకోవడంలో సదరు అధికారి దిట్ట అనే ప్రచారం ఆశాఖ వర్గాల్లో లేకపోలేదు.

వసతి గృహాల నిర్వహణపై న్యాయాధికారి ఆగ్రహం



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రెండు వసతి గృహాలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక సాయి అనాథ ఆశ్రమాన్ని ఆయన తనిఖీ చేసిన సమయంలో వాటి నిర్వహణను పరిశీలించి ఆగ్రహం వ్యక్తంచేశారు. వసతి గృహంలో సరైన రికార్డులు లేవని, పరిశుభ్రతను పాటించడం లేదని అక్కడి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అనాథ ఆశ్రమానికి సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయక పోవడంపై అక్కడి సిబ్బందిని మందలించారు. ఆ తర్వాత ఆయన స్థానిక ఇందిరాగాంధీ నగర్‌లోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని కూడా పరిశీలించారు. కార్యాలయానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి వారికి అందించే భోజన వసతి సదుపాయాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ ఎం.వెంకట హరినాథ్, పారా లీగల్ వలంటీర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, చైల్డ్ వెల్ఫేర్ డీసీపీవో శారద, తదితరులు పాల్గొన్నారు.

నేడు న్యాయవాదుల విధుల బహిష్కరణ

కర్నూలు లీగల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు న్యాయవాది గురు రాజరావుపై జరిగిన దాడిని ఖండిస్తూ బుధవారం స్థానిక బార్ అసోసియేషన్ తమ విధులను బహిష్కరిస్తున్నట్లు రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు పాలూరి రవిగువేరా, కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరినాథ చౌదరి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయవాదిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వారు ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఇంటిల్లిపాది అటువైపే

- పొలాల్లోనే వంటావార్పు
- వాహనాల్లో వస్తున్న ఆశావహులు
- పత్తికొండ, తుగ్గలి, మద్దికెరలో వజ్రాల కోసం అన్వేషణ

ఓ వజ్రం దొరక్కపోతుందా! తుగ్గలి మండలం జొన్నగిరి పొలాల్లో వజ్రాల వేట





వెతకాలంటే తినాలి కదా మరి..



నువ్వు బొజ్జో నాన్నా..

తుగ్గలి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వర్షాలు పడితే చాలు ప్రతి ఒక్కరూ వేట షురూ చేస్తారు. అది మామూలు వేట కాదు... వజ్రాల వేట. వర్షం తమకు అదృష్టాన్ని తీసుకొస్తుందా? లేదా? అని ఆశగా చూస్తుంటారు. సాధారణంగా వర్షాకాలం మొదలైందంటే అన్నదాతలు ఆకాశం వైపు చూస్తారు. చినుకు పడితే చాలు వారి ఆనందానికి అవధులు ఉండవు. కానీ అక్కడ మాత్రం రైతులతో పాటు సామాన్య ప్రజలు, ఉద్యోగులు వేలాదిగా తరలివచ్చి వజ్రాల కోసం అన్వేషిస్తుంటారు. వరుణ దేవుడి రాక కోసం ప్రార్థనలు చేస్తారు. ఒక్క తొలకరి వర్షంతో లక్షాధికారులు, కోటీశ్వరులు అయిపోవాలనే ఆశతో వజ్రాల అన్వేషణ చేస్తుంటారు. తొలకరి వర్షాలతో భూ ఉపరితలంపై ప్రత్యక్షమయ్యే వజ్రాల కోసం పత్తికొండ, తుగ్గలి, మద్దికెర ప్రాంతాలకు వేలాదిమంది తరలి వస్తుంటారు. కర్నూలు, అనంతపురం, మహబూబ్ నగర్, కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి సైతం ఈ వజ్రాలను వెతికేందుకు కార్లు, ప్రత్యేక వాహనాల్లో ఆశగా వస్తున్నారు.

పత్తికొండ నియోజకవర్గ పరిధిలోని తుగ్గలి, మద్దికెర మండలాల పరిధిలోని ఎర్రగుడి, జొన్నగిరి, చిన్నజొన్నగిరి, పగడిరాయి, అమినాబాద్, తుగ్గలి, మదనంతపురం, పెరవలి పంటపొలాల్లో విలువైన వజ్రాలు దొరుకుతుంటాయి. వజ్రాలు దొరుకుతున్నాయని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కావడంతో నంద్యాల, తాడిపత్రి, అనంతపురంతో పాటు కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి కూడా వజ్రాన్వేషకులు ఇక్కడకు వచ్చి అన్వేషిస్తున్నారు. ఈ ఏడాది వేల సంఖ్యలో వజ్రాన్వేషకులు ఆటోలలో, కార్లలో ఇంటిల్లిపాది వచ్చి అన్వేషిస్తున్నారు. వచ్చిన వారు దాదాపు నెల రోజులు, వారం రోజులకు సరిపడా బియ్యం, సరుకులు తీసుకుని వచ్చి ఇక్కడే పొలాల్లోనే వంట చేసుకుంటూ వజ్రాల కోసం వెదుకు లాట ప్రారంభించారు. కొందరు చిన్నారులతో పాటు రావడంతో వారికి వారి వాహనాల్లోనూ, చెట్లకు ఊయల ఏర్పాటు చేసి నిద్రపుచ్చుతున్నారు.

● ఈ విషయంపై వజ్రాన్వేషితుల నుంచి వివరణ కోరగా.. పనులేమీ లేక అప్పుల బాధ నుంచి బయట పడాలని, ఇంటిల్లి పాది వచ్చామని, ఇక్కడ హోటల్‌లో భోజనం చేస్తే అధిక ధరలు వెచ్చించాల్సి వస్తుందని, బియ్యం, బేడలు తెచ్చుకుని వంట చేసుకుని తింటున్నామని చెప్పారు. ఒక వజ్రం దొరికితే తమ జీవితాలు మారుతాయని వేలాది మంది ఆశావహులు ఎంతో ఆశతో వజ్రాన్వేషణ చేస్తున్నారు.

కిషోర బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధపెట్టాలి

- ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.నిర్మల



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ పి.నిర్మల

కర్నూలు హస్పిటల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కిషోర బాలికలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.నిర్మల అన్నారు. కల్లూరు మండలం లక్ష్మీపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిషోరి వికాసం ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కిషోర బాలికలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. జిల్లా బాలల సంరక్షణ అధికారిణి టి.శారద మాట్లాడుతూ కిషోర బాలికల వికాసానికి పోషకాహారం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం తల్లిదండ్రులు తమ పిల్లలకు 18 సంవత్సరాలు నిండేవరకు వివాహం చేయమని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం అబ్బాయిలకు, అమ్మాయిలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ అనూరాధ, సూపర్‌వైజర్ జమీల, ప్రొటెక్షన్ ఆఫీసర్ బి.పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

అవుకు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కుమ్మరిదిడ్డి వీధికి చెందిన కాటికాళ్ల లక్ష్మీదేవి (56) మంగళవారం విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకుంది. లక్ష్మీదేవి భర్త పెద్ద పుల్లయ్య అనారోగ్యంతో మూడు సంవత్సరాల క్రితం మృతిచెందడం, ఇద్దరు కొడుకులకు వివాహం కాకపోవటంతో మనస్తాపంచెంది లక్ష్మీదేవి ఇంట్లోనే విషద్రావణం తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబసభ్యులు గమనించి 108లో అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. రెండో కుమారుడు కరుణాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

అనారోగ్యంతో మరొకరు..

బనగానపల్లె, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో కోవెలకుంట్ల మండలం సౌదరదిన్నెకు చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకటరమణ(38) చాలా కాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఎన్నో ఆస్పత్రుల్లో చూపించినా నయం కాలేదు. మంగళవారం భార్య అనురాధతో కలిసి బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు వచ్చాడు. భార్య డాక్టర్ల వద్దకు వెళ్లగా ఆస్పత్రి ఆవరణలో ఉన్న వెంకటరమణ పురుగుల మందు తాగాడు. వైద్య సిబ్బంది వెంటనే ఆస్పత్రిలోకి తరలించి చికిత్స చేసినా ఫలితం లేకపోయింది మృతుని భార్య అనురాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

అప్పులు అధికమై రైతు బలవన్మరణం

- రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి: ఎమ్మెల్యే విరుపాక్షి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ఇన్‌సెట్లో రైతు బోయ చిన్నబాబయ్య(ఫైల్)

ఆలూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హుళేబీడు గ్రామానికి చెందిన రైతు చిన్న బాబయ్య(63) అప్పుల బాధ తాళలేక మంగళవారం పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. బంధువులు ఆయనను ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. చిన్న బాబయ్య తన ఏడెకరాల పొలంలో గత యేడాది మిరప, పత్తి సాగు చేశాడు. ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రాలేదు. ఈ ఖరీఫ్‌లో పంట సాగు చేసేందుకు చిల్లిగవ్వ కూడా చేతికి రాలేదు. అప్పులు ఎలా చెల్లించాలో తెలియక పురుగుల మందు తాగాడు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో రూ.2 లక్షలు, వడ్డీ వ్యాపారుల దగ్గర మరో రూ.8 లక్షలు అప్పు ఉన్నదని, తమ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని మృతుడి భార్య అంబమ్మ వేడుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ దంపతులకు ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

అప్పుల బాధతో మృతి చెందిన రైతు బాబన్న కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి. రైతుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడం వల్లే ఇలా ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. **- విరుపాక్షి, ఎమ్మెల్యే**

పురుగుమందు తాగి హెడ్ కానిస్టేబుల్..

కర్నూలు క్రైం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పురుగుమందు తాగి ఓ ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.



వెంకటేశ్వర్లు (ఫైల్)

వివరాలు. ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు (55)గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓలాడ్జీలో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా సిబ్బంది గమనించి బంధువులకు సమాచారమిచ్చారు. చికిత్స నిమిత్తం హుటాహుటిన ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. కుటుంబ సమస్యలు, వ్యక్తిగత సమస్యలతోనే ఈ ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. 1991 బ్యాచ్‌కు చెందిన ఈయన ఏఆర్ విభాగంలో కానిస్టేబుల్‌గా చేరారు. తర్వాత సివిల్‌కు కన్వర్టు అయ్యాడు. ప్రస్తుతం కర్నూలు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు సంతానం ఉన్నారు.

మృతదేహానికి రీ పోస్టుమార్టం

నంద్యాల టౌన్, జూన్10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 4వ తేదీన ఎస్బీఐ కాలనీలో ఉన్న ఎంఆర్ ఆసుపత్రిలో పంటి వైద్యం కోసం వెళ్లి చికిత్స వికటించి జావీద్ అనే వ్యక్తి మృతి చెందాడు. దీంతో ఆ రోజున బంధువులు ఆందోళనలు చేసి మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లి వారి సంప్రదాయం ప్రకారం పూడ్చారు. కానీ రెండు రోజుల క్రితం మృతుడి కూతురు షాజీదా రెండో టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మంగళవారం రెవెన్యూ పోలీసు, వైద్య అధికారుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. ఆలస్యంగా పోస్టుమార్టం నిర్వహించడంపై ఉత్కంఠ నెలకొంది. త్వరలో పోస్టుమార్టం వివరాలు అందిన తర్వాత తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, వైద్యుడు అనిల్, టూ టౌన్ ఎస్ఐలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

డోన్ టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన భరద్వాజ్(20) అనే యువకుడు మంగళవారం అదృశ్యమయ్యాడు. యువకుడు రైలు నెంబర్.17252 కాచిగూడ నుంచి గుంటూరు ఎక్స్‌ప్రెస్‌లో డోన్‌కు ప్రయాణిస్తుండగా.. అదృశ్యమైనట్లు తెలుస్తోంది. జీఆర్‌పీ ఎస్ఐ బిందుమాధవి మాట్లాడుతూ యువకుడి ఆచూకీ తెలిస్తే భరద్వాజ్ తండ్రి సెల్ నెం.7075659850, ఆర్‌పీఎస్ఐ నెంబర్. 9030481295 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని అన్నారు.

చైన్ స్నాచర్ల హల్‌చల్

- గంటన్నర వ్యవధిలో మూడుచోట్ల చైన్ స్నాచింగ్‌లు
- అప్రమత్తమైన పోలీసులు
- ముమ్మర గాలింపు చర్యలు



కర్నూలు క్రైం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో చైన్ స్నాచర్లు హల్‌చల్ చేశారు. మంగళవారం ఒక్కసారిగా రెచ్చిపోయారు. గంటన్నర వ్యవధిలోనే మూడు చోట్ల స్నాచింగ్ చేశారు. మొదట తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలో పుల్లయ్య కాలేజీ సమీపంలో అపూర్వ వెంచర్ వెనుకాల లక్ష్మీదేవి అనే ఉపాధ్యాయురాలి మెడలో నుంచి మూడు తులాల బంగారు గొలుసు అపహరించారు. ఈమె బ్రాహ్మణకొట్కూరులో టీచర్‌గా పనిచేస్తుంది. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో నిత్యావసర సరుకుల కోసం రోడ్డుపైకి వచ్చి తిరిగి వెళ్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు మెడలోని గొలుసును తెంపుకుని ఉడాయించారు. బాధితురాలు కేకలు వేసినా ఫలితం లేకపోయింది.

ఈ సంఘటన జరిగిన అరగంటకే త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెంకటాద్రినగర్‌లో యశోద అనే మహిళ మెడలో నుంచి గొలుసు తెంపుకుని పరారయ్యారు. ఆమె తన ఇంటి ముందు నిల్చుని ఉండగా ఫ్యాషన్ బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు చటుక్కున ఆమె మెడలోని గొలుసు తెంపుకుని ఉడాయించారు. అపహరణకు గురైన గొలుసు విలువ సుమారు మూడు తులాలు ఉంటుందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ సంఘటన జరిగిన గంట సేపటి వ్యవధిలోనే నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో సంతోష్ నగర్‌లో భాగ్యలక్ష్మీ అనే మహిళ మెడలోని నుంచి చైన్ లాగేశారు. ఈమె సంతోష్‌నగర్ లోని రోడ్డు నెంబరు 6లో మసీదు సమీపంలో తన బాడుగ ఇంటి నుంచి సొంతింటికి వెళ్తుండగా.. మోటారు సైకిల్‌పై వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలోని గొలుసు తెంపుకుని ఉడాయించారు. బాధితురాలు తేరుకుని కేకలు వేసేలోపే ఆ యువకులు పరారయ్యారు. నగరంలో మూడు చోట్ల స్నాచింగ్‌లు జరగడంతో పోలీసులు ఒక్కసారిగా ఉలికిపడ్డారు. వెంటనే అప్రమత్తమై పలు చోట్ల గాలించారు. సీసీ కెమెరాలను పరిశీలించారు. ఆగంతకుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

ఆలయాల్లో దొంగతనం

- లక్ష్మీనరసింహ ఆలయంలో బంగారం, హుండీ చోరీ
- మారెమ్మవ్వ, కాశిరెడ్డినాయన ఆలయాల్లో కూడా...
- డాగ్ స్క్వాడ్, ఫింగర్ ప్రింట్స్‌తో తనిఖీ



చోరీకి గురైన స్వామి వారి బంగారం కళ్లు, మీసాలు

దేవనకొండ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్ల చెలిమల (నర్మామల) గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో సోమవారం రాత్రి దొంగలుపడ్డారు. స్వామి వారి బంగారం మీసాలు, కళ్లు, భూదేవి, శ్రీదేవిల బంగారపు కళ్లు, మూడేళ్ల నుంచి హుండీలో ఉన్న సొమ్ము, అలాగే మారెమ్మవ్వ దేవాలయం, కాశీరెడ్డి నాయన ఆలయం, దండలు వదిలే స్వామికొండ వద్ద హుండీలు చోరీ చేశారు. మంగళవారం ఉదయం ఆలయం తలుపులు తెరిచేందుకు వెళ్లిన గుడి పూజారి చంద్రయ్య చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ వంశీనాథ్ తమ సిబ్బందితో ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం కర్నూలు నుంచి ఫింగర్ ప్రింట్ క్లూస్‌టీం సభ్యులు, డాగ్ స్క్వాడ్‌తో పరిసరాలను పరిశీలించారు.

కరెంట్ తీగ దొంగతనం..

దేవనకొండ పరిసర ప్రాంతంలోని పొలాల్లో వ్యవసాయ మోటర్ల వద్ద వున్న కరెంట్ తీగను గుర్తు తెలియని వ్యక్తులు కోసుకెళ్లిన్నట్లు రైతులు రాజు, రమేష్, దస్తగిరి, మళ్ల బాషా తెలిపారు. ఒక్కొక్కరికి చెందిన దాదాపు రూ. 4 వేలకు పైగా విలువ చేసే వైరు కోసుకెళ్లినట్లు రైతులు తెలిపారు. ఈ విషయంపై స్థానిక పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

నిజాయితీ చాటిన ఆ ముగ్గురు..

- నగదు, నగల బ్యాగ్ పోలీసులకు అప్పగింత
- బాధితులకు అందజేసిన రూరల్ ఎస్ఐ



నగలు, డబ్బును బాధితులకు అప్పజెప్పుతున్న రూరల్ ఎస్ఐ

ఎమ్మిగనూరు రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ఒక్క రూపాయి దొరికినా వదలని వాళ్లు ఉన్నారు. అలాంటి ఏకంగా లక్షల విలువైన ఆభరణాలు, నగదు ఉన్న సంచి రోడ్డు మీద దొరికినా నిజాయితీగా పోలీసులకు అప్పగించారు ఆ ముగ్గురు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఎమ్మిగనూరుకి చెందిన సోహెల్‌బేగ్, వలి, పెద్దకడుబూరుకి చెందిన కురువ నరసింహులు పనినిమిత్తం ఆదోనికి వెళ్తున్నారు. మండలంలోని బోడబండ గ్రామ సమీపాన మెయిన్‌రోడ్డుపై వారికి ఓ బ్యాగ్ దొరికింది. అది తెరిచిచూడగా అందులో రెండు బంగారు బిస్కెట్లు, నల్లపూసల బంగారు దండ, రెండు పొరల బంగారు దండ, బంగారు నెక్లెస్ దండ, చెవిచుట్లు, బ్రాస్లెట్, ఒక జత కమ్మలు, వెండి చైన్లుతో పాటు సుమారు రూ.2.50లక్షల నగదు, దుస్తులు ఉన్నాయి. ఎవరో బ్యాగ్‌ను పోగొట్టుకున్నారని గమనించిన వారు వెంటనే ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులుకు బ్యాగ్‌ను అప్పజెప్పారు. అదే సమయంలో నందవరానికి చెందిన కురువ లలిత భర్త, చంద్రగుప్త ఆదోని నుంచి వచ్చి తమ బ్యాగ్ పోయిందని తెలిపారు. పోలీసులు విచారించి ఆ బ్యాగ్ లలిత, చంద్రగుప్తలదని నిర్ధారించుకున్నారు. బాధితులకు ఆ ముగ్గురి సమక్షంలోనే ఎస్ఐ శ్రీనివాసులు బ్యాగ్‌ను అప్పగించారు. తమ బ్యాగ్‌ను అప్పజెప్పిన ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులకు, బ్యాగ్‌ను నిజాయితీగా తెచ్చి పోలీస్ స్టేషన్‌లో అప్పజెప్పిన సోహెల్‌బేగ్, వలి, కురువ నరసింహులుకు వారు ధన్యవాదాలు తెలిపారు.

యువకులపై పోక్సో కేసు

గోనెగండ్ల, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను వేధిస్తున్న ఇద్దరు యువకులపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. పోలీసుల సమాచారం మేరకు.. అనిల్, జాన్ అనే ఇద్దరు యువకులు కొన్ని రోజులుగా ఆదే గ్రామానికి చెందిన బాలికను ప్రేమించమంటూ వేధిస్తున్నారు. రోజురోజుకు వీరి వేధింపులు తీవ్రం కావడంతో బాలిక తన తల్లికి విషయం తెలిపింది. బాలిక తల్లి మంగళవారం గోనెగండ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విచారణ చేసిన అనంతరం బాలికను వేధిస్తున్న యువకులపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

డీపీవోగా లలితా బాయి

నంద్యాల రూరల్ జూన్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ అధికారిగా లలితాబాయిని నియమిస్తూ ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నుంచి సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం డీఎల్‌డీవోగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై నంద్యాల జిల్లా పంచాయతీ అధికారిగా త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుత స్థానంలో ఇన్‌చార్జి డీపీవోగా పని చేస్తున్న నంద్యాల డీఎల్‌డీవో శివారెడ్డి ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు.

సమన్వయంతో పనిచేయండి: ఈవో

నంద్యాల కల్చరల్(శ్రీశైలం), జూన్ 10(ఆంధ్రజ్యోతి): దేవస్థానంలో అన్ని విభాగాలు కూడా పరస్పర సమన్వయంతో విధులు నిర్వర్తించాలని శ్రీశైలం ఆలయ ఈవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం శ్రీశైలంలో పరిపాలనాంశాల పరిశీలనలో భాగంగా శ్రీశైలక్షేత్ర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. భక్తులపై శ్రద్ధ చూపాలన్నారు. క్యూకాంప్లెక్స్‌లో భక్తులకు నిరంతరం మంచినీరు, బిస్కెట్లు, అల్పాహారం అందిస్తుండాలని సిబ్బందికి సూచించారు. అన్నప్రసాద వితరణలో ఆయా వంటకాలన్నీ రుచికరంగా ఉండేలా అన్నప్రసాద సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రద్దీకి అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఇంజనీరింగ్ విభాగం వారు ప్రణాళికలు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో రమణమ్మ, ఈఈ మురళీకృష్ణ, నరసింహారెడ్డి, అన్ని విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, ఇన్‌చార్జి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, సహాయ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీశైలేశుడి గిరి ప్రదక్షిణ

నంద్యాల కల్చరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో స్వామి అమ్మవార్లకు మంగళవారం వైభవంగా గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ఆలయ మహాద్వారం నుంచి మొదలైన ఈ ప్రదక్షిణ గంగధార మండపం, అంకాళమ్మ ఆలయం, నంది మండపం, బయలువీరభద్రస్వామి ఆలయం నుంచిఅలంకారేశ్వర ఆలయం మీదుగా వలయ రహదారిపై చేరుకుంది. అక్కడ నుంచి సారంగధర మఠం మీదుగా సాగి హేమారెడ్డి మల్లమ్మ మందిరం నుంచి మహిషాసురమర్దిని, రుద్రాక్షమఠం, విభూది మఠాల మీదుగా రుద్రవనంలోకి చేరుకుంది. రుద్రవనం నుంచి నంది మండపం వద్దకు రావడంతో ఈ గిరి ప్రదక్షిణ ముగిసింది.

మహిళల జోలికొస్తే ఊరుకోం

- వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ సంజీవలక్ష్మి



నిరసన తెలుపుతున్న టీడీపీ మహిళా నాయకులు

కర్నూలు అర్బన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మహిళల జోలికొస్తే ఊరుకోమని వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ సంజీవలక్ష్మి హెచ్చరించారు. మంగళవారం నగరంలోని కృష్ణదేవారాయల విగ్రహం వద్ద నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహం ఎదుట మహిళలు నిరసన తెలిపారు. మహిళా నాయకులు మాట్లాడుతూ అమరావతి వేశ్యల రాజధాని అంటూ వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టు కృష్ణంరాజు, డిబేట్ నిర్వహించిన జగన్ మీడియా వ్యాఖ్యాత కొమ్మినేని శ్రీనివాసరావుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాక్షి మీడియా మహిళల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిందన్నారు. టీడీపీ నగర అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ జర్నలిస్టు ముసుగులో మహిళల పట్ల కించ పరిచేవిధంగా మాట్లాడిన వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ముంతాజ్, మారుతి శర్మ, కార్పొరేటర్లు రమణమ్మ, మాజీ కార్పొరేటర్లు, బూత్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

ప్యాకెట్ పార్కు పనులు త్వరగా పూర్తి చేయాలి

నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు



పార్కు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఆనంద్ థియేటర్ సమీపంలోని హంద్రీ నది ఒడ్డున డంప్ తొలగించి నిర్మిస్తున్న ప్యాకెట్ పార్కు పనులు త్వరితగతిన పూర్తిచేయాలని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ప్యాకెట్ పార్కు పనులను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ఆదేశాల మేరకు హంద్రీ నదిఒడ్డున ఉన్న డంప్ తొలగించామని, ఆ స్థానంలో రూ.10 లక్షలతో ప్యాకెట్ పార్కు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఫెన్సింగ్, గ్రావెల్ పనులు దాదాపు పూర్తి అయ్యాయని, పచ్చదనం పనులను త్వరగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ తెలి పారు. అంతకు ముందు కమిషనర్ వెంకటరమణ కాలనీ, అశోక్‌నగర్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, హార్టికల్చర్ ఏడీ విజయలక్ష్మి, డీఈఈలు కృష్ణలత, గంగాధర్, టీపీఈలు మహేష్, మనోజ్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

కోడుమూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రైతులకు రాయితీపై మంగళవా రం విత్తనాలు పంపిణీ చేశారు. దస్తగిరి మాట్లాడుతూ ఖరీఫ్‌లో రైతులకు ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ కింద వేరుశనగ, కందులు, కొర్ర వంటి విత్తనాలను అందిస్తుందని అన్నారు. అన్ని గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలతోపాటు రసాయనిక ఎరువులను కూడా అందు బాటులో ఉంచామన్నారు. అలాగే రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందని చెప్పారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని అందించేందుకు మండలంలో 15,925 మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ ఏడీఏ సాలోరెడ్డి, మండల వ్యవసాయ అధికారి రవిప్రకాష్, సిబ్బంది, టీడీపీ నాయకులు రామక్రిష్ణారెడ్డి, బడెసాగౌడ్, గోపాల్‌నాయుడు, రవీంద్ర గౌడ్, గంగాధర్ నాయుడు, బ్రిటీష్ రాముడు పాల్గొన్నారు.

మూడు వార్డులను అభివృద్ధి చేస్తా: ఎమ్మెల్యే

కర్నూలు రూరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో ఉన్న మూడు వార్డులను దశల వారీగా అభివృద్ధి చేస్తానని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు. కర్నూలు అర్బన్ మండలంలోని స్టాంటన్‌పురంలోని పలు వీధుల్లో సీసీరోడ్లు, మురుగు కాలువలకు కోడుమూరు ఎమ్మెల్యేతోపాటు, కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి కలిసి మంగళవారం భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ ఒక్కొక్క వార్డులో మురుగు కాలువ, సీసీరోడ్లు కలిపి రూ.38లక్షలు చొప్పున మూడు వార్డులకు రూ.1.26కోట్లతో నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన వివరించారు. విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నాలుగేళ్లలో శివారు కాలనీలతో పాటు గ్రామీణ ప్రాంతాలు రోడ్లను మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు కురవ నాగమధు, సుందర్‌రాజు పాల్గొన్నారు.

మహిళలపై రాజకీయాలు చేయడం మానుకోవాలి

ఓర్వకల్లు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మహిళలపై రాజకీయాలు చేయడం మానుకోవాలని అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు హనీసా షాషా అన్నారు. మంగళవారం నన్నూరులో ఆమె విలేకరులతో మాట్లాడుతూ అమరావతి మహిళలను వేశ్యలు అంటూ కించపరుస్తూ మాట్లాడిన జగన్ మీడియా జర్నలిస్టులు కృష్ణం రాజు, కొమ్మినేని శ్రీనివాసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలపై దురుసుగా మాట్లాడితే వైసీపీకి పుట్టగతులు ఉండవన్నారు.

సెల్ సిగ్నల్స్ పనిచేయక అవస్థలు

ఓర్వకల్లు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఓర్వకల్లులో ఎయిర్‌టెల్ సిగ్నల్స్ పని చేయకపోవడంతో వినియోగదారులు అవస్థలు పడ్డారు. గత ఐదు రోజుల నుంచి ఫోన్లు రాకపోవడం, వెళ్లక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వినియోగదారులు తెలిపారు. ఇప్పటికైనా ఎయిర్‌టెల్ యాజమాన్యం స్పందించి సిగ్నల్స్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న వైసీపీ మహిళా నాయకులు

కర్నూలు న్యూసిటీ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి విమర్శించారు. మంగళవారం వైసీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శశికళ అధ్యక్షతన పాతబస్టాండు వద్ద ఉన్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి వినతి పత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కంగాటి శ్రీదేవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి మద్యం అమ్మకాలపై ఉన్న శ్రద్ధ మహిళల రక్షణపై లేదన్నారు. డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, రాష్ట్ర మహిళా కార్యదర్శి కల్లా నాగవేణిరెడ్డి, కార్పొరేటర్ అర్షియా పర్వీన్ పాల్గొన్నారు.

పట్టణ ప్రణాళిక విభాగంలో బదిలీలు

కర్నూలు న్యూసిటీ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగంలో పని చేస్తున్న డిప్యూటీ సిటీ ప్లానర్ శోభన్‌బాబు, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ మష్రత్ అలీఖాన్‌లను బదిలీ చేస్తూ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ ఆర్‌జే.విద్యుల్లత మంగళ వారం ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా డీసీపీ శోభన్‌బాబును బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో ప్లానింగ్ ఆఫీసర్‌గా, మష్రత్ అలీఖాన్‌ను డోన్ మున్సిపాలిటీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరి స్థానంలో ఇంకా ఎవ్వరిని నియమించలేదు.

నిర్లక్ష్యపు నీడలో..

- మార్కెట్ యార్డులోని పలు ప్రాంతాల్లో పెరిగిన ముళ్లకంపలు, పిచ్చిమొక్కలు
- బూత్‌బంగ్లాను తలపిస్తున్న గెస్ట్‌హౌస్
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా కోల్డ్ స్టోరేజీ భవనం
- భయాందోళనలో రైతన్నలు

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో కొన్ని ప్రాంతాలు నిర్లక్ష్యపు నీడలో కొట్టుమిట్టాడుతున్నాయి. ముళ్లకంపలు, పిచ్చిమొక్కలతో అడవిని తలపిస్తున్నాయి. లక్షలు విలువ చేసి నిర్మించిన భవనాలు పాములకు స్థావరాలుగా మారాయి. దీంతో సుదూర ప్రాంతాల నుంచి పంట ఉత్పత్తులను అమ్ముకుందామని తరలి వస్తున్న రైతులు భయాందోళన చెందుతున్నారు. విషపురుగులు, పాముల బారిన పడాల్సి వస్తుందేమోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడపాల్సిన పరిస్థితి దాపురించింది. దాదాపు రూ.కోటి ఖర్చు పెట్టి గెస్టుహౌస్‌ను ఏడీఎం కార్యాలయం పక్కన నిర్మించారు. ఈ గెస్టుహౌస్‌ను కనీసం సంవత్సరానికి ఒక్కసారైనా వినియోగించకపోవడంతో ప్రస్తుతం ఆ భవనం బూత్‌బంగ్లాను తలపిస్తోంది. గతంలో ఇక్కడ ముఖ్యమైన సమావేశాలు నిర్వహించే వారు. క్రమక్రమంగా గెస్టుహౌస్‌ను ప్రైవేటు కార్యకలాపాలకు కొంత మంది రాజకీయ నాయకులు వినియోగిస్తున్నారన్న ఆరోపణలు వచ్చాయి. గెస్టు హౌస్ నిర్వహణ భారం కావడంతో దీన్ని మూసివేశారు. పెద్ద పెద్ద పాములు ఈ గెస్టు హౌస్ పరిసరాల్లో సంచరిస్తున్నాయి. కోల్డ్ స్టోరేజీ ప్లాంటు నిర్మాణాన్ని మధ్యలోనే నిలిపివేశారు. వైసీపీ ప్రభుత్వం నిధులను వెనక్కి తీసుకెళ్లిపోవడంతో ఈ భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఈ ప్లాంటు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. కొంత మంది మందుబాబులు బీర్, మద్యంసీసాలు ఇక్కడికే తెచ్చుకుని రాత్రిపూట జల్సా చేస్తున్నారు. సెక్యూరిటీ గార్డులు, యార్డు సిబ్బంది వారిని నియంత్రించేందుకు ప్రయత్నించినా బెదిరింపులకు దిగుతున్నారు. కోల్డ్ స్టోరేజీ ప్లాంటు పనులు ప్రారంభించేందుకు ప్రస్తుత మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి రూ.6 కోట్లతో ప్రతిపాదనలను మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌కు పంపారు.. సొంతంగా ఈ కోల్డ్ స్టోరేజీ ప్లాంటును నిర్వహించడం అలవికాని పనిగా మార్కెట్ కమిటీ అధికారులు భావిస్తున్నారు. ప్రైవేటు వ్యక్తులకు ఈ ప్లాంటును అప్పజెప్పాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. జంబో గోదాము ప్లాంటు పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరిగాయి. కనీసం ఆర నెలలకోసారైనా గెస్టు హౌస్, కోల్డ్ స్టోరేజీ ప్లాంట్లు, జంబో గోదాము పరిసరాల వద్ద వ్యాపించిన ముళ్లకంపలు, చెట్లను తొలగించి పరిశుభ్రంగా ఉంచితే పాములు దరి చేరవని రైతులు పేర్కొంటున్నారు. రాత్రి సమయంలో గస్తీని ఏర్పాటుచేయాలని రైతులు అధికారులకు మొర పెట్టుకుంటున్నారు.





గెస్ట్ హౌస్ పరిసరాల్లో పిచ్చిమొక్కలు, జంబో ప్లాట్‌ఫాం గోదాము వద్ద ఉన్న మద్యం సీసాలు



కర్నూలు మార్కెట్ యార్డు కోల్డు స్టోరేజీ ఆవరణలో ముళ్ల పొదలు

రైతులకు ఇబ్బందులు రానీయం

మార్కెట్‌యార్డులో గెస్టుహౌస్ ప్రస్తుతం వినియోగంలో లేదు. వినియోగంలోకి తెచ్చేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడుతాం. రాత్రి సమయంలో ఎవరైనా యార్డులోకి ప్రవేశించి మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. రాత్రిపూట సెక్యూరిటీ గార్డులతో గస్తీ ముమ్మరం చేస్తాం. రైతులకు ఎటువంటి ఇబ్బందులు రానీయం.

● జయలక్ష్మి, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ, కర్నూలు మార్కెట్‌యార్డు

శారీరక వ్యాయామం తప్పనిసరి



నర్సింగ్ విద్యార్థులతో ఆర్‌బీఎస్‌కే జిల్లా కో-ఆర్డినేటర్

కర్నూలు హాస్పిటల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): శారీరక వ్యాయామంతో రక్తపోటుతో పాటు ఆరోగ్యం మెరుగుపడుతుందని ఆర్‌బీఎస్‌కే అండ్ ఎన్‌సీడీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ మహేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. కర్నూలు రైల్వేస్టేషన్‌లో మంగళవారం ప్రపంచ రక్తపోటు నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక వ్యాయామం లేకుండా కూర్చొని పని చేస్తే ఆరోగ్యం పాడవుతుందని, జీవనశైలిలో వచ్చిన మార్పులతో ఎక్కువ మంది అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. బీపీ, మధుమేహం, క్యాన్సర్‌తో పాటు ఇతర వ్యాధులను ప్రారంభంలోనే గుర్తించి చికిత్స తీసుకోవాలన్నారు. ప్రతి రోజు అరగంట వ్యాయామం చేయడం వల్ల అసంక్రమిత వ్యాధులను నివారించవచ్చునన్నారు. కర్నూలు రైల్వేస్టేషన్ ఉద్యోగులకు బీపీ పరీ క్షలు నిర్వహించారు. అనంతరం కర్నూలు ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ మార్కెట్ యార్డు వైద్యాధికారి నాగసౌమ్య, డిస్ట్రిక్ట్ ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ మంజుల, ఆర్‌బీఎస్‌కే కన్సల్టెంట్ మల్లికార్జున పాల్గొన్నారు.

ప్రజారోగ్యాన్ని కాపాడాలి : సీపీఎం



చెత్త దిబ్బను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని సీపీఎం మండల కార్యదర్శి కృష్ణ అన్నారు. మంగళవారం సీపీఎం బృందం ఆధ్వర్యంలో బొల్లవరం గ్రామాన్ని సందర్శించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కృష్ణ మాట్లాడుతూ బొల్లవరం విలేజ్ హెల్త్ సెంటర్ సమీపంలోని చెత్త దిబ్బలను పరిశీలించారు. నెలల తరబడి గ్రామంలో చెత్త సేకరణ పనులు నిలిచిపోయాయని, డ్రైనేజీల్లో పూడిక తొలగించడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో నాగశేషులు, నీలన్న, కిష్టన్న పాల్గొన్నారు.

రజక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

కల్లూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): రజక వృత్తిదారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని రజక వృత్తిదారుల సంఘం కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం 32వ వార్డు ముజఫర్‌నగర్, గంగావతినగర్, షారుక్ నగర్‌లోని రజకులు గంగమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఇంటింటికీ గంగమ్మను ఊరేగించి హంద్రీనది సమీపంలో రజకులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. సంఘం నాయకుడు గురుశేఖర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూరైనా ఎన్నికల ముందు రజకులకు ఇచ్చిన హామీలు అమలుపర్చడంలో విఫలమైందని విమర్శించారు. రజకులకు దోబీఘాట్లు ఏర్పాటు చేయాలని, 50 ఏళ్ల నిండిన వారందరికీ పింఛన్ అందజేయాలని, రజక వృత్తిదారులకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో న్యూసిటీ కార్యదర్శి సి.శేషాద్రి, రమణ, లక్ష్మన్న, దేవేంద్ర, దుర్గమ్మ, జయమ్మ పాల్గొన్నారు.

మహిళలకు వైఎస్ భారతి క్షమాపణ చెప్పాలి

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి మహిళల ర్యాలీ

కల్లూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మహిళలను అవమానిస్తే ఊరుకునేది లేదని, వైఎస్ భారతి క్షమాపణ చెప్పాలని మహిళలు డిమాండ్ చేశారు. అమరావతి మహిళలను అత్యంత జుగుప్సాకరంగా దూషించిన జగన్ మీడియా ప్రతినిధులు కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావులపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం మాధవీ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి అమ్మ హాస్పిటల్ సెంటర్ వరకు మహిళలు నిరసన వ్యక్తం చేస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం సాక్షి పేపర్ ప్రతులను దహనం చేశారు. వైసీపీ నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యలను ఖండించకపోగా సంకర జాతి వారిగా చిత్రీక రించడం అవివేకానికి అజ్ఞానానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహిళా నాయకులు శైలజా యాదవ్, మసుంధర, రాములమ్మ, పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్ యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, పల్లె రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అమ్మ హాస్పిటల్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించండి



మాట్లాడుతున్న ఏఎన్ఎం మహేశ్వరి

ఓర్వకల్లు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కిషోర బాలికల ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని ఏఎన్ఎం మహేశ్వరి సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన ఓర్వకల్లులోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వయసులో సరైన పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీ నత అధికంగా పెరగడమే కాకుండా దృఢంగా ఉంటారన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు వై.రాధమ్మ, వెంకటేశ్వరి, శారద, జయమ్మ, మల్లేశ్వరి, ఆశా వర్కర్లు శోభా, కృష్ణవేణి, వరలక్ష్మి, రాజేశ్వరి, అనూరాధ, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి యోగా దివ్యఔషధం

కర్నూలు న్యూసిటీ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ ఆరోగ్యానికి యోగా సాధన దివ్య ఔషధమని నగర పాలక మేనేజర్ చిన్నరాముడు అన్నారు. మంగళవారం బిర్లా కాంపౌండులోని ఖానా ఖజానా వద్ద స్ట్రీట్ యోగా కార్యక్రమానికి ఆయన హాజరై ఆసనాలు వేశారు. చిన్నరాముడు మాట్లాడుతూ ఆరోగ్యంగా జీవించడానికి యోగాసనాలను నిత్యం ఆచరించాలన్నారు. కార్యక్రమంలో కోచ్‌లో అవినాష్‌శెట్టి, మునిస్వామి, అక్షర తదితరులు పాల్గొన్నారు.

కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి: ఏవో

సి.బెళగల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కౌలుకార్డులకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ కౌలు రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని కంబంధహాల్ గ్రామంలో కౌలు రైతులతో సమావేశమయ్యారు. మల్లేష్‌కుమార్ మాట్లాడుతూ కౌలు రైతులు భూయజమానులతో కౌలుకు తీసుకున్నట్లు ఒప్పంద అగ్రిమెంట్, ఆధార్‌కార్డు తప్పనిసరిగా జతపరచాలన్నారు. ఈసమావేశంలో ఎంపీఈవోలు, రైతులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలను విజయవంతం చేయండి

ఆర్గనైజింగ్ కమిటీ కో-ఆర్డినేటర్ హర్షవర్ధన్



మాట్లాడుతున్న హర్షవర్ధన్

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకు జరిగే ఉమ్మడి జిల్లా స్థాయి అంతర్ పాఠశాలల క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఆర్గనైజింగ్ కమిటీ కో-ఆర్డినేటర్ సి.హర్షవర్ధన్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కర్నూలు క్లబ్బులో ఏర్పాటు చేసిన ఒలింపిక్స్ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా క్రీడాంశాల్లో నిర్వహించే పోటీల వివరాలను వెల్లడించారు. నాగరత్నమయ్య (ఆర్చరీ), హర్షవర్ధన్ (అథ్లెటిక్స్), సుధీర్ (హాకీ), సువర్ణ (హ్యాండ్‌బాల్); శ్రీనివాసులు (ఫుట్‌బాల్) ప్రతాప్ (కరాటే), నబీ సాహేబ్ (స్కై మార్షల్ ఆర్ట్స్), వెంకటేశ్వర్లు (తైక్వాండో), సుంకన్న (కబడ్డీ), దాదా బాషా (బాస్కెట్‌బాల్), వేణుగోపాల్ (పవర్ లిఫ్టింగ్), షేక్షావలి పాష (వెయిట్ లిఫ్టింగ్) జాఫర్ మున్నా (వాలీబాల్) విజయకుమార్ (త్రోబాల్), రవికుమార్ (రైఫిల్ షూటింగ్), రాఘ వేంద్ర (సిలంబం), ప్రభాకర్ (యోగాసన), చంద్ర (జూడో) ఈనెల 22న కర్నూలు నగరంలో మెగా ఒలంపిక్ డే రన్ నిర్వహి స్తున్నట్లు సంఘం తీర్మానించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సం ఘం అధ్యక్షులు రామాంజనేయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు గంగాధర్, నాగరత్నమయ్య, ప్రవీణ్, ప్రభాకర్, విజయకుమార్, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, రవికుమార్, చిన్న సుంకన్న, బాలాజీ, వంశీ, షకీల్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

కర్నూలు న్యూసిటీ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించే వరకు పోరాడతామని ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం నగర పాలక కార్యాలయం ఎదుట ఇంజనీరింగ్ కార్మికులు వంటా వార్పు చేసుకుని నిరసన తెలిపారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిన్న రాత్రి నుంచి పూర్తి స్థాయిలో కార్మికులంతా విధులను బహిష్కరించి సమ్మెలోకి వచ్చారన్నారు. ప్రజలకు ఎలాంటి ఆటంకం కలగకుండ ఇన్ని రోజులు సామూహికంగా సమ్మె చేసిన అధికారులు, ప్రభుత్వాలు మా సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మనోహర్, రాష్ట్ర కోశాధికారి సమీర్ బాషా, ఉపాధ్యక్షుడు నాగ శేషులు, కార్యదర్శి యాసిన్‌బేగ్, జ్ఞానమ్మ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నియంత్రించాలి

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని అధికారులు నియంత్రించాలని మాజీ కార్పొరేటర్, ఎస్సీ ఎస్టీ డీవీఎంసీ సభ్యులు గుడిపల్లి సురేంద్ర అన్నారు. మంగళవారం ఆయన నగరంలోని రోడ్డు సైడ్ వ్యాపారులు ప్లాస్టిక్ కవర్ల వినియోగించరాదని సూచించారు. అనంతరం వ్యాపారులకు అవగాహన కల్పించారు.

బాల్య వివాహాలు చేస్తే జైలుకే



గర్భిణులతో మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి రఘు

సి.బెళగల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేస్తే జైలు శిక్ష తప్పదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నోడల్ అధికారి రఘు అన్నారు. మంగళవారం మండలంలోని పోలకల్లు, సి.బెళగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. నోడల్ అధికారి రఘు మాట్లాడుతూ గ్రామాల్లో పదో తరగతి పూర్తయిన వెంటనే అమ్మా యిలకు బాల్యవివాహాలు చేయడానికి తల్లిదండ్రులు సిద్ధమవుతున్నారని, అది చట్టరీత్యా నేరమని అన్నారు. అనంతరం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి మిథున్ కుమార్‌రెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు

కర్నూలు రూరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని జిల్లా పరిషత్ ఆవరణలో ఉన్న కర్నూలు మండల పరిషత్ సమావేశ భవనంలో మంగళవారం సినీహీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎన్‌టీకే, మోక్షజ్ఞ సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొని నందమూరి అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్‌చేశారు. ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ నందమూరి బాలకృష్ణ ఇటు సినిమాల్లోను, అటు రాజకీయాల్లోను ప్రజల మన్నలు పొంది మూడుసార్లు హిందూపురం ఎమ్మెల్యేగా బాలకృష్ణ గెలవడం అభినందనీయమన్నారు. తిక్కారెడ్డి మాట్లాడుతూ తెలుగువారి గుండెలో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి ఎన్టీ ఆర్ అని ఆయన వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని సినిమా రంగంలో ప్రజల మనస్సుల్లో బాలకృష్ణ ఎంతో అభిమానాన్ని చాటుకున్నారన్నారు. కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం ఆనాడు ఎన్టీఆర్ టీడీపీని స్థాపించి చరిత్ర సృష్టించారన్నారు. అదేకోవలో ఆయన తనయుడు బాలకృష్ణ కూడా పేదలకు అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని కొనియాడారు. అనంతరం రక్తదాన కార్యక్ర మాన్ని ప్రారంభించారు. టీడీపీ నాయకులు మాజీ జడ్పీ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు, ఐటీడీపీ కృష్ణమనాయుడు, మండల కన్వీనర్లు బుర్ర వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, కొంతలపాడు రామాంజనే యులు, టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పూల రామకృష్ణ పాల్గొన్నారు.

బాలకృష్ణకు ఎంపీ జన్మదిన శుభాకాంక్షలు

కర్నూలు అర్బన్: నందమూరి బాలకృష్ణకు ఎంపీ బస్తిపాటి నాగరాజు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన సోషల్‌మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ద్వారా పేదలకు ఉచిత వైద్యం అందిస్తున్నారని, సినీ, రాజకీయ రంగాల్లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి, తిక్కారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి

కోడుమూరు: పట్టణంలో నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు మంగళవారం అభిమానులు ఘనంగా నిర్వహించారు. స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని టీడీపీ జెండా కట్ట దగ్గర అభిమానులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బాలకృష్ణ అభిమానులు ఎల్లప్పనాయుడు, బడెసాగౌడ్, బలరాం, రాముడు, మాదన్న, క్రిష్ణ పాల్గొన్నారు.

గూడూరు: మండలంలోని ఆర్.కానాపురంలో నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను ఎన్‌టీకే ఫ్యాన్స్, టీడీపీ నాయకులు జరుపుకున్నారు. మంగళవారం మండల తెలుగు యువత అధ్యక్షుడు సుమన్ బాబు ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు, బాలకృష్ణ అభిమానులు కేక్ కట్ చేశారు. నాయకులు సుంకిరెడ్డి, కృష్ణ, శ్రీనివాసరెడ్డి, ఎల్లప్ప పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండలంలోని హుశేనాపురంలో నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. హుశేనాపురంలో టీడీపీ నాయకులు, బాలకృష్ణ అభిమానులు రామగోవిందు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కాల్వబుగ్గ మాజీ చైర్మన్లు చంద్రపెద్దస్వామి, జీకే సుధా కర్, మాజీ ఎంపీటీసీ నాగరాజు, మండల తెలుగు యువత అధ్యక్షుడు రాము, జగదీష్, అన్వర్ బాషా, బజారు, వేణు పాల్గొన్నారు.

మాంసం వ్యాపారులకు నోటీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆలూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బహిరంగ ప్రదేశాల్లో మాంసం విక్రయాలపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ముక్క ముక్కకు అనారోగ్యం' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన పత్తికొండ డివిజనల్ పంచాయతీ అధికారి వీరభద్రప్ప తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆలూరు డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్ రావును ఆదేశించారు. ఆయన మంగళవారం మాంసం వ్యాపారు లకు నోటీసులు జారీ చేశారు. ఈనెల 20లోగా మాంసం వ్యాపారులు సంత మార్కెట్‌లోకి వెళ్లాలని, అలాగే వైద్య పరీక్షల తర్వాతే జంతువులను వధించాలని నోటీసులో పేర్కొన్నారు. అలా చేయని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైద్య కళాశాల ప్రైవేటీకరణ దుర్మార్గం


వైద్యకళాశాల వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

ఆదోని అగ్రికల్చర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాలలను రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటీకరించడం దుర్మార్గమని ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి బందేల నాసర్‌జి అన్నారు. మంగళవారం పట్టణ శివారులోని ప్రభుత్వ వైద్య కళాశాల వద్ద ఆందోళన చేసి, విద్యాశాఖ మంత్రి లోకేష్ దిష్టి బొమ్మను దహనం చేశారు. వైద్య కళాశాల పనులను అర్ధాంతరంగా నిలిపివేయడం తగదన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మెడికల్ విద్యార్థులకు శాపంగా మారిన జీవో 107, 108ను రద్దు చేస్తామని యువగళంలో లోకేష్ మాట ఇచ్చి, నిలబెట్టుకోలేదన్నారు. తమకు వైద్య కళాశాలలు అవసరం లేదని మెడికల్ కౌన్సిల్‌కు సీఎం చంద్రబాబు లేఖ రాయడం పేదలకు వైద్యాన్ని దూరం చేయడమేనన్నారు. సోమన్న, షాబీర్ బాషా, రంగస్వామి, శరత్, కుమార్, థామస్, దస్తగిరి శ్రీకాంత్ వీరేష్, అశోక్ మోహన్ పాల్గొన్నారు.

'సాక్షి'పై చర్యలు తీసుకోవాలి


పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న మహిళలు

ఆలూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మహిళలను అవమానించిన సాక్షి ఛానల్ యాజమాన్యం, ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని మహిళలు మంగళవారం ఆలూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మహబూబ్ బాషాకు ఫిర్యాదు చేశారు. సాక్షి టీవీలో జర్నలిస్టు ముసుగులో కొమ్మినేని, కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలు మహిళలను తీవ్రంగా కలిచి వేశాయన్నారు. మహిళలకు సాక్షి యాజమాన్యం క్షమాపణ చెప్పాలని మహిళలు దేవమ్మ, సరోజమ్మ, స్వాతి, శంకరమ్మ, పద్మ, నాగవేణి, రంగమ్మ, ఉమాదేవి, లక్ష్మీదేవి, పట్టణ టీడీపీ నాయకులు హనుమప్ప డిమాండ్ చేశారు.

ఉద్యోగులకు బదిలీ సహజం


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ అధికారులు, డీలర్లు

మద్దికెర, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులకు బదిలీలు సహజమని తహసీల్దార్ హుశేన్ సాహెబ్ అన్నారు. ఇక్కడి నుంచి పత్తికొండకు బదిలీ కావడంతో తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్ రవిని రెవెన్యూ అధికారులు, డీలర్లు సన్మానించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎక్కడ పనిచేసినా ప్రజల మన్ననలు పొందాలని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని సూచించారు. డీటీ శ్రీదేవి, ఆర్ఐ రామదాసు, రెవెన్యూ సిబ్బంది మోదీన్, దామోదర్, డీలర్లు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీకి సెలవు ప్రకటించాలి


సహాయ కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న హమాలీలు

ఆదోని అగ్రికల్చర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఏరువాక పౌర్ణమి సందర్భంగా బుధవారం మార్కెట్ కమిటీకి సెలవు ప్రకటించాలని ఎద్దుల బండి హమాలీ అసోసియేషన్ నాయకులు రావుఫ్, నాగరాజు, లక్ష్మన్న, కోరారు. మంగళవారం సహాయ కార్యదర్శి శాంత కుమార్‌కు కలిసి వినతిపత్రం అందజేశారు. ఏటా ఎద్దుల పండగ నిర్వహించడం తమకు ఆనవాయితీగా వస్తోందన్నారు. స్పందించిన అధికారులు సెలవు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దు


ఆదోనిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ఆదోని రూరల్, జూన్ 10 ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను ఎవరూ ప్రోత్సహించవద్దని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాగిణి వసంతి, అంగన్‌వాటీ టీచర్ విమల కోరారు. కిశోరి బాలికల సాధికారతలో బాగంగా మంగళవారం అంబేడ్కర్ నగర్ అంగన్‌వాడీ సెంటర్-3లో తల్లిదండ్రులకు అవగాహన కల్పించిన అనంతరం ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాలతో వచ్చే నష్టాలను తెలియజేశారు. బాల్య వివాహాలను ప్రోత్సహించమని ప్రతిజ్ఞ చేయించారు. హెల్పర్లు లక్ష్మీదేవి, బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాలికలను చదివించండి

ఆస్పరి: బాలికలను చదివించాలని సీడీపీవో మద్దమ్మ, సర్పంచ్ రాధమ్మ సూచించారు. మంగళవారం ఆస్పరిలో మహిళలత కలిసి ర్యాలీ నిర్వహించారు. బాలికల విద్యకు ప్రభుత్వాలు రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నాయన్నారు. సిబ్బంది పద్మ, సునీత, మహిళలు పాల్గొన్నారు.

నేను రాను బాబోయ్!

- ఆలూరు తహసీల్దార్‌గా వచ్చేందుకు ఇష్టపడని అధికారులు
- అధికార పార్టీలో వర్గ విభేదాలే కారణం
- ఐదు మండలాలకు ఇన్‌చార్జి తహసీల్దార్‌లే దిక్కు



ఇబ్బంది పడుతున్న ప్రజలు

ఇన్‌చార్జిల పాలనలో సమస్యలు పరిష్కారం కాక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు అధికారులు కూడా ఎవరిమాట వింటే ఏమవుతుందోనన్న భయంతో పనులు చేయడానికి వెనకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. టీడీపీలో వర్గపోరు ఉండటంతో ఎవరిమాట వింటో ఏమవుతుందోన్న భయంతో ఉన్నట్లు ఓసీనియర్ అధికారి వ్యాఖ్యానించారు. ఇలాగే కొనసాగితే నియోజవర్గంలో రెవెన్యూ శాఖ అస్తవ్యస్తంగా మారే అవకాశం ఉంది. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు సమన్వయం చేసుకుని సమస్యను పరిష్కరించుకోవలసి ఉంది.

ఆలూరు నియోజకవర్గంలోని అధికార పార్టీలో మూడు నాలుగు గ్రూపులు ఉండటంతో ఇక్కడ పనిచేసేందుకు తహసీల్దార్లు ముందుగా రావడం లేదు. ఏ పని చేస్తే ఎవరితో తలనొప్పి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఆలూరు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డీటీకి బాధ్యతలు అప్పగించేందుకు ప్రయత్నిస్తుండటంతో ఆయన సెలవులో వెళ్లేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇన్‌చార్జిలతో తమ పనులు కాక ప్రజలు అవస్థలు పడుతున్నారు.

ఆలూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అధికార పార్టీ నాయకుల తీరుతో నియోజకవర్గంలో పనిచేసేందుకు తహసీల్దార్లు ముందుకు రావడం లేదు. దీంతో అయిదు మండలా లకు రెగ్యులర్ తహసీల్దార్ లేరు. అధికార పార్టీ నాయకుల విబేధాలతో తమకెందుకు తలనొప్పి అని పనిచేసేందుకు ఇష్టపడటం లేదు. బలవంతంగా పోస్టింగ్ ఇచ్చినా సెలవులో వెళ్లిపోతున్నారు.

అయిదు మండలాలకు ఇన్‌చార్జిలే దిక్కు.

ఇటీవల నిర్వహించిన బదీల్లో 5 మండలాలకు రెగ్యులర్ తహసీల్దార్లను నియమించలేదు. ఇక్కడ అధికార పార్టీ నాయకుల్లో విబేధాలు ఉండటంతో ఇక్కడ పనిచేసేందుకు తహసీల్దార్లు ఆసక్తి చూపడం లేదు. దేవనకొండ మండలానికి మాత్రమే రెగ్యులర్ తహసీ ల్దార్‌గా రామాంజనేయులును నియ మించారు. ఆలూరు తహసీల్దార్ గోవింద్ సింగ్‌ను అధికారులు బదిలీ చేసి, డీటీ విజయ్‌కుమార్‌కు ఇన్‌చార్జిగా బాధ్యతలు ఇచ్చేందుకు అధికారులు సిద్ధమయ్యారు. అయితే బాధ్యతలు తీసుకోడానికి డీటీ నిరాకరించినట్లు సమాచారం. ఒకవేళ బలవంతంగా బాధ్యతలు అప్పగించినా దీర్ఘకాలిక సెలవులో వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. మరోవైపు హాలహర్వి మండల డీటీ లక్ష్మికి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగిం చారు. చిప్పగిరి మండలానికి కూడా డిప్యూటీ తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ను ఇన్‌చార్జి తహసీ ల్దార్‌గా కొనసాగిస్తున్నారు. ఆస్పరిలో డీటీ రమేష్ రెడ్డిని ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కొనసాగిస్తున్నారు. ఇక హొళగుంద తహసీల్దార్ సతీష్ నాలుగు నెలల క్రితం బదిలీపై వెళ్లగా డిప్యూటీ తహసీల్దార్ నిజాముద్దీన్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కొనసాగించ డాన్ని చూస్తే ఇక్కడ వర్గ పోరు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

రాజీనామా ఆమోదించండి

- ఆదోని మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్ ఆవేదన


మాట్లాడుతున్న కౌన్సిలర్ బాలాజీ

ఆదోని అగ్రికల్చర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అధికారులు తన వార్డులో సమస్యలు పరిష్కరించనప్పుడు తాను చేసిన రాజీనామాను ఆమోదించాలని వైసీపీ కౌన్సిలర్ బాలాజీ కోరారు. మంగళవారం చైర్‌పర్సన్ సీహెచ్ లోకేశ్వరి అధ్యక్షతన మునిసిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఝూన్సీ లక్ష్మి బాయి కూరగాయల మార్కెట్‌కు ఇటీవల నిర్వహించిన వేలం దక్కించుకున్న వారికి వసూళ్లు చేసే హక్కును కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. కౌన్సిలర్ విజ్ఞప్తిపై స్పందించిన చైర్‌పర్సన్ రాజీనామా అవసరం లేదని అభివృద్ధి చేస్తామని, అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు ఫయాజ్, చలపతి, అశోక్ రాజేశ్వర్ రెడ్డి, మాజీ చైర్‌పర్సన్ శాంత, పార్వతి పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే శ్యాంబాబు


జూటూరులో నాగలిపట్టి దుక్కిదున్నుతున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

పత్తికొండ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. మండలంలోని జూటూరులో మంగళవారం ఏరువాక పౌర్ణమి సందర్బంగా నాగలి పట్టి దుక్కిదున్నారు. ఈ ఏడాది ముందుగానే వర్షాలు కురుస్తుండటంతో రైతులు వ్యవసాయ పనులు ప్రారంభిచారని, వారికి అవసరమైన విత్తనాలను ప్రభుత్వం ముందుగానే సరఫరా చేసిందన్నారు. ఈ ఏడాది రైతులకు మంచి దిగుబడులు రావాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. టీడీపీ ప్రభుత్వం రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అందుబాటులోకి తెచ్చిందన్నారు. రైతును రాజుగా మార్చేందుకు సీఎం చంద్రబాబు ప్రత్యేక పథకాలను అందుబాటులోకి తెచ్చారన్నారు. నాటి డిప్యూటీ సీఎం కేఈ క్రిష్ణమూర్తి హంద్రీనీవా నీటిని చెరువులకు మల్లించే కార్యక్రమాన్ని ప్రాంభించార న్నారు. అదే స్పూర్తితో 70 కి.మీ.ల మేర తూములు ఏర్పాటుచేసి సాగునీరు అందించనున్నామని అన్నారు. సాంబశివారెడ్డి, రామానాయుడు, జూటూరు ఈశ్వరప్ప, విజయ మోహన్‌రెడ్డి, బాస్కర్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైస్ ఎంపీపీ భర్త సంజప్ప

ఎమ్మెల్యే శ్యాంబాబు సమక్షంలో జూటురుకు చెందిన వైసీపీ ఎంపీటీసీ(వైస్ ఎంపీపీ) వడ్డేరంగమ్మ భర్త వడ్డే సంజప్ప టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ టీడీపీ నాయకుడు బాస్కర్‌రెడ్డిని పరామర్శించారు.

చిరు ధాన్యాలతో రైతులకు గిట్టుబాటు

- రైతులకు శాస్త్రవేత్తల సూచన


మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ శ్రీవిద్య

ఆస్పరి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): చిరు దాన్యాలు పండిస్తే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీవిద్య మౌనిక సూచించారు. మంగళవారం మండలంలోని జొహరాపురం గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం మానవాళికి చిరుధాన్యాల అవసరం ఎంతో ఉందన్నారు. కొర్రలు, సజ్జలు, మినుములు, పెసలు, కంది, శనగ సాగుతో భూసారం అభివృద్ధి చెందుతుందన్నారు. సిబ్బంది తేజ కుమార్, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు


కేక్ తినిపించుకుంటున్న టీడీపీ నాయకులు

పత్తికొండ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు పత్తికొండలో మంగళవారం నిర్వహించారు. అబిమాన సంఘం నాయకులు సింగంశ్రీను ఆధ్వర్యంలో టీడీపీ నాయకుడు సాంబశివారెడ్డి, తిరుపాల్, రామానాయుడు, సోమ్లానాయక్, బీటీ గోవిందులు కేక్ కట్‌చేశారు. తండ్రి వారత్వంతో సినీ రంగంలోకి అడుగుపెట్టిన బాలకృష్ణ తనదైన శైలిలో చిత్రాలు చేస్తూ గుర్తింపు తెచ్చుకున్నారని, ఇటు రాజకీయ రంగంలో రాణిస్తున్నారన్నారు. అనంతరం ప్రభుత్వ వైద్యాధికారి కల్పన ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ నేతృత్వంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.

ఆస్పరి: టీడీపీ నాయకులు శేషాద్రి నాయుడు, సతీష్‌కుమార్, రంగనాథ్, రాజ్‌కుమార్, బాబు మహేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని/ఆదోని రూరల్, జూన్ 10 ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా పట్టణంలోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆదోని నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళిక కార్యాలయాన్ని మంగళవారం ఎమ్మెల్యే, సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్, ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ కృష్ణ ప్రారంభించారు నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళిక కార్యాలయానికి ఛైర్మన్‌గా ఎమ్మెల్యేను నియమిస్తూ, ప్రభుత్వం జారీ చేసిందన్నారు. తాను ఇక్కడి నుంచే ఆదోని అభివృద్ధికి బాటలు వేస్తానన్నారు. తన లెటర్ ప్యాడ్ ఉపయోగించి, అధికార బదిలీల్లో డబ్బులు వసూలు చేసినట్లు ఆధారాలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

వీఆర్వోకు షోకాజ్

హాలహర్వి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కామినహాల్ వీఆర్వో మస్తాన్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తహసీల్దార్ లక్ష్మి మంగళవారం తెలిపారు. నీటి పన్ను డేటా నమోదు, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. ఆర్డీవో ఆదేశాల మేరకు నోటీసు జారీ చేశామన్నారు. వీఆర్వోలు ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రామలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

తుగ్గలి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నునుసరాళ్ల గ్రామం రామలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం నిర్వహించారు. మహిళలు కలశాలతో ఊరేగింపుగా వచ్చి స్వామివారికి సమర్పించారు. ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి, సర్పంచ్ రామలక్ష్మి, గోపాల్ రెడ్డి, డా.రమణారెడ్డి, మాజీ సర్పంచ్ రంగారెడ్డి, శ్రీనివాసరెడ్డి, వార్డెన్ రమేష్, రమణారెడ్డి ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

సదరం క్యాంపును ప్రారంభించండి

పత్తికొండ టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సదరం క్యాంపులు ప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి క్రాంతి నాయుడు ఆర్డీవో భరత్ నాయక్‌కు వినతి పత్రం ఇచ్చారు. గతంలో దివ్యాంగులకోసం సదరం క్యాంప్ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించేవారని, ఆరు నెలలుగా ఏర్పాటు చేయడం లేదన్నారు. దీంతో దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రసాద్‌బాబు, హర్ష పాల్గొన్నారు.


ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న క్రాంతి నాయుడు

ఉద్యోగులకు మెమోలు

ఆలూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సమయానికి విధులకు హాజరుకాని ఐదు మంది సచివాలయం-3 ఉద్యోగులకు డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్‌రావు మంగళవారం ఎక్స్‌ప్రెస్ మెమోలు జారీ చేశారు. ఇందుకు ఉద్యోగులు తాము ఫీల్డ్‌కు వెళ్లామని, అందుకే ఆలస్యంగా వచ్చామని, ఇకపై ఇలా జరగకుండా చూసుకుంటామని వివరణ ఇచ్చారు. మరోసారి పునరావృతమైతే చర్యలు తప్పవని డిప్యూటీ ఎంపడీవో హెచ్చరించారు.


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మార్కెట్ యార్డు డైరెక్టర్లు

రైతుల సమస్యలను పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే

మద్దికెర, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ సమస్యలను పత్తికొండ మార్కెట్ యార్డు అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే శ్యాంబాబు అన్నారు. డైరెక్టర్లుగా ఎంపికైన మదనంతపురం గ్రామానికి చెందిన దేవేంద్ర, మద్దికెరకు చెందిన లక్ష్మీదేవి, హంపా గ్రామానికి చెందిన లక్ష్మీదేవి జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు సమక్షంలో ఎమ్మెల్యే శ్యాంబాబును మంగళవారం సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో ముగ్గురికి మార్కెట్ యార్డు డైరెక్టర్లుగా చోటు కల్పించామని తెలిపారు. టీడీపీ రైతుల ప్రభుత్వం అని, రైతుల కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. టీడీపీ మహిళ అధ్యక్షురాలు జానకమ్మ, శ్రీనివాసులు, సంజప్ప, లింగమయ్య ఉన్నారు.

తహసీల్దార్‌తో రైతుల వాగ్వాదం


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న బాధిత రైతులు

హాలహర్వి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తమ అనుమతి లేకుండా వారసత్వం భూములు ఎలా మారుస్తారంటూ మండలం లోని కామినహాల్ గ్రామ రైతులు చల్లా రంగనాయకులు, వసంతలక్ష్మి తహసీల్దార్ లక్ష్మితో మంగళవారం వాగ్వాదానికి దిగారు. సర్వే నెం. 77/1లో 70 సెంట్లు, 293/బీ3లో 2.55 ఎకరాలను ఇతరుల పేర్లతో ఎలా మార్చారని నిలదీశారు. నాలుగు నెలలుగా కలెక్టర్, పత్తికొండ ఆర్డీవో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారుల్లో చలనం లేదని వాపోయారు. స్పందించిన తహసీల్దార్ లక్ష్మి వీఆర్వో తప్పిదంతో ఇలా అయిదని, న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక


టీడీపీలోకి చేరిన వారితో పార్టీ ఇన్‌చార్జి మీనాక్షినాయుడు

ఆదోని, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద తుంబళం గ్రామం వైసీపీకి చెందిన 20 కుటుంబాలు మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం టీడీపీలో చేరారు. వైస్ ఎంపీపీ రాజేశ్వరి, అన్వర్‌బాషా ఆధ్వర్యంలో ఇన్‌చార్జి మీనాక్షి నాయుడు తన నివాసంలో వారిని పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వాలిలో చాకలి సురేష్, కుప్పయ్య, పూజ అంజనేయ, ఈరన్న, పింజరి నబి, తిమ్మయ్య, ముక్రయరయ్య, రాజు, హరిజన నాగరాజు తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి


మాట్లాడుతున్న సూపర్‌వైజర్

దేవనకొండ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివలింగమ్మ కోరారు. మంగళవారం అంగన్‌వాడీ కేంద్రం-1 లో కిశోరి వికాసం నిర్వహించారు. బాలికల విద్యతో కుటుంబం, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. జీఎంఎస్‌కె మాధవి, టీచర్లు జ్యోతి ఉన్నారు.

పొగతో అవస్థలు


పెట్రోల్ బంకు వద్ద రోడ్డుపై అలముకున్న పొగ


కాలనీలో అలముకున్న దట్టమైన పొగ

- చెత్తకు నిప్పు, ఇబ్బంది పడుతున్న స్థానికులు

ఆదోని, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివార్లలోని పురపాలక సంఘం డంపింగ్ యార్డులోని చెత్తకు కొందరు నిప్పు పెడుతున్నారు. దీంతో ఆ ప్రాంతంలోని రాయలసీమ కొట్టాల పైకాలనీ, కిందకాలనీ, వైఎంకే నగర్ ప్రాంతాల ప్రజలు దుర్గంధంతో అవస్థలు పడుతున్నారు. వీరితోపాటు మంత్రాలయం, సిరుగుప్ప, జాతీయ రహదారి, ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిలో రాకపోకలు సాగించే వాహనదారులు, పయాణికులు రోడ్డు సరిగా కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొగతో తాము అనారోగ్యం బారిన పడుతున్నామని అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

తిపొగ రాకుండా చూస్తాం



కర్నూలు, నంద్యాల, ఆదోని పంప్ యార్డుల నిర్వహణను మహారాష్ట్రకు చెందిన సౌరక్ష కంపెనీకి అప్పగించారు. ఇప్పటికే కర్నూలు, నంద్యాలలో పనులు ప్రారంభమయ్యాయి. ఆదోనిలో ఈనెల 15 నుంచి వారు పనిచేస్తారు. పొగలు రావడంతో ఎక్స్‌కవేటర్ సాయంతో కంపోస్టును వెడల్పు చేసి ఆర్పించాను. **- కృష్ణ మున్సిపల్ కమిషనర్, ఆదోని**

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య



మాట్లాడుతున్న రామచంద్రయ్య

ఎమ్మిగనూరు రూరల్, జూన్10(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని మంజునాథ్ ఫంక్షన్ హాల్‌లో సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న అధ్యక్షతన మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల జనరల్ బాడీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, సహాయ కార్యదర్శి మునెప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ 11 సంవత్సరాల పరిపాలన కాలంలో దేశంలో పేదరికం, దారిద్ర్యం, నిరుద్యోగ సమస్యలు పెరిగిపోయాయన్నారు. దేశంలో ఆదాని, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తుల సంపద పెరుగుతుంటే దానిని దేశ సంపద అని చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు. దేశంలో 140 కోట్ల జనాభాలో 30శాతం మంది ఆర్థాకలితో అలమటిస్తున్నారని నివేదికలు చెబుతున్నాయన్నారు. వ్యవసాయం లాభసాటిగా మార్చడానికి వేసిన స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేస్తే ఆర్థిక సంక్షోభం వస్తుందని చెబుతున్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు రూ.62వేల కోట్లు బ్యాంకు రుణాలను ఎలా రద్దు చేశారని ప్రశ్నించారు. సమావేశంలో సీపీఐ నాయకులు భాస్కర్‌యాదవ్, వంపన్నగౌడు, మహేశ్వరి, మహిళా సమాఖ్య నాయకురాలు ఈరమ్మ, వీరేష్, గోపాల్, నాయక్, రాజు, గిడ్డయ్య, నాగప్ప, మద్దిలేటినాయుడు, సోమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఐఐటీ - జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో విద్యార్థిని ప్రతిభ

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జీనియస్ గ్లోబల్ జూనియర్ కాలేజీ విద్యార్థిని అనూష మాధురి ఐఐటీ - జేఈఈ అడ్వాన్స్ ఎగ్జామ్‌లో అల్ ఇండియా ఎగ్జామ్‌లో 3610 ర్యాంక్ సాధించిందని కాలేజ్ కరస్పాండెంట్ గంగాధర్ తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలేజ్ స్థాపించిన మొదటి సంవత్సరంలోనే ఐఐటీ - జేఈఈ అడ్వాన్స్ ఎగ్జామ్‌లో అల్ ఇండియా ర్యాంక్ సాధించడంతో సంతోషం వ్యక్తం చేశారు అనంతరం విద్యార్థిని సత్కరించి ఆమె తల్లిదండ్రులకు, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు.

ఎమ్మార్పీఎస్‌తోనే మాదిగలకు ఆత్మగౌరవం

గోనెగండ్ల, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్‌తోనే మాదిగలకు ఆత్మగౌరం దక్కిందని మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు సుమాల ఆంధ్రయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో జూలై 7న పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చేపట్టే కార్యక్రమాల గురించి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంఆర్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మహాదేవ ఆధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ల క్ష్మన్న, అడివన్న, గంజల్లయ్య, మదుసూదనరావు. చంద్ర, మేకలన్న, కౌలుట్ల, రాజేష్, రంగస్వామి, రాజు, భాస్కర్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు

నందవరం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముగతి గ్రామంలో మంగళవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధావతి ఆధ్వర్యంలో కిషోర బాలికలకు బాల్యవివాహాలు చేయకూడదనే అంశంపై ర్యాలీ నిర్వహించి వారి తల్లిదండ్రులకు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల వచ్చే అనర్థాల గురించి వివరించారు. కిషోర బాలికలు ఒక లక్ష్యాన్ని ఎంచుకుని పట్టుదలతో వారి భవిష్యత్‌ను తీర్చి దిద్దుకోవాలన్నారు. కార్యక్రమంలో కుముద్దినిదేవి, హరిత, సరస్వతి భాగ్యమ్మ, కిషోర బాలికలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్ : ఆడ పిల్లలకు బాల్య వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని మహిళా పోలీస్ శ్రేష్ఠ, ఏఎన్ఎం నాగజ్యోతిలో తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ఏనుగుబాల గ్రామంలో కిశోరి వికాసం కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలోని ఆడపిల్లల తల్లిదండ్రులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండితేనే ఆడ పిల్లలకు వివాహం చేయాలన్నారు. అంతకంటే తక్కువ వయసు ఉన్న ఆడ పిల్లలకు వివాహం చేస్తే చట్టపరంగా శిక్షార్హులవుతారన్నారు. ప్రతి ఆడపిల్లను పాఠశాలలకు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు అంజినమ్మ, జయమ్మ, పెద్దక్క, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

లాయర్లు నిరసన తెలపడం సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మంత్రాలయం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని మాలపల్లి గ్రామంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, వైసీపీ లీగల్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కరణం గురురాజారావు కుటుంబాల మధ్య భూవివాదం వల్ల ఘర్షణ జరిగితే లాయర్లందరూ నిరసన తెలియజేయడం ఏమిటని, ఇది సరికాదని వాల్మీకి, బోయ పోరాట సమితి (వీబీపీఎస్) రాష్ట్ర అధ్యక్షులు రామ్‌భీమ్ నాయుడు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాఘవేంద్రరావు అన్నారు. మంగళవారం స్థానిక అయోధ్య అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వాల్మీకులపై చిన్నచూపు చూస్తూ భూతగాదాల పేరుతో ప్రతిచిన్న అంశాన్ని అడ్వకేట్ గురురాజారావు కేసులు పెడుతూ మానసికంగా హింసిస్తున్నారని ఆరోపించారు. న్యాయవాదులంటే తమకు గౌరవం ఉందని, కానీ గురురాజు వంటి అడ్వకేట్‌కు మద్దతు పలకడం సరికాదన్నారు. రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో గురురాజరావుకు అండగా నిలిచిన లాయర్లు కూడా పునరాలోచించాలని చెప్పారు. సమావేశంలో వీబీపీఎస్ నాయకులు వరదరాజులు, చాపల నగేష్, బీసీ తిమ్మప్ప, లక్ష్మన్న, రంగన్న వీరారెడ్డి, లింగప్ప, రామాంజి, నరసింహులు, ముత్తురెడ్డి, మేకల మల్లేష్, హనుమంతు, గంగన్న, బసవరాజు పాల్గొన్నారు.

బకాయిలను విడుదల చేయాలి

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సెలర్ నాగమణి. జిల్లా కార్యదర్శి ఎల్లప్ప డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి రావాల్సిన మెడికల్ బిల్లులు, పీఎఫ్ లోన్లు, ఈఎల్ఎస్ బిల్లులకి సంబంధించిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు మల్లారి నాగరాజు, కౌలన్న, నరసింహులు పాల్గొన్నారు.

మంత్రాలయంలో ట్రాఫిక్ అస్తవ్యస్తం

● ప్రధాన రహదారులపైనే వాహనాలు పార్కింగ్ ● పార్కింగ్ స్థలాలు లేని ప్రైవేట్ లాడ్జీలు, హోటళ్లు ● ఆక్రమణకు గురైన ఆర్‌అండ్‌బీ రోడ్లు ● ఇష్టారాజ్యంగా ఆటోలు



ప్రధాన రహదారిలో నిలిచి పోయిన వాహనాలు



ఉన్నతపాఠశాల మైదానంలో పార్కింగ్ చేసిన వాహనాలు



ఆర్‌టీసీ బస్‌స్టాండ్‌లో నిలిపిన ప్రైవేట్ వాహనాలు

మంత్రాలయం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. పోలీసులు ట్రాఫిక్‌ను ఎంత నియంత్రణ చేసినా అదుపు కావడంలేదు. దీంతో భక్తులు, గ్రామస్తులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సెలవు దినాలు కావడంతో రాఘవేంద్ర స్వామి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. సొంత వాహనాల్లో వచ్చిన భక్తులు ముఖద్వారం, శ్రీమఠానికి వెళ్లే ప్రధాన రహదారి, రాఘవేంద్ర సర్కిల్, మాధవరం హైవే రోడ్డు, పోలీసు స్టేషన్ ఎదురుగా, నాగలదిన్నె రోడ్డు, ఆర్‌టీసీ బస్‌స్టాండ్ రోడ్డుకు ఇరువైపులా తమ వాహనాలను పార్కింగ్ చేయడంతో ఇబ్బందులు తలెత్తాయి. దీనికి తోడు ఆటోలు ఇష్టారాజ్యంగా తిప్పడం, భారీ వాహనాల రవాణతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఆయా పోలీస్‌స్టేషన్ నుంచి అదనపు సిబ్బందితో ట్రాఫిక్ నియంత్రణ చేసినా ఫలితం లేకుండా పోయింది. ప్రైవేట్ లాడ్జీలు, హోటళ్లకు పార్కింగ్ స్థలాలు లేకపోవడం, ఆర్‌అండ్‌బీ రోడ్లు, శ్రీమఠం రోడ్లు, గ్రామ పంచాయితి రోడ్లు కూడా కబ్జా అవడం ట్రాఫిక్‌కు ప్రధాన సమస్యగా మారింది. వీటిని క్రమబద్ధీకరించాల్సిన అధికారులు పట్టించుకోకపో వడంతో పోలీసులకు తలనొప్పిగా మారింది. సెలవురోజుల్లో ట్రాఫిక్‌పై నియంత్రణ లేకపోవడంతో వివిధ రాష్ట్రాల భక్తులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్రీమఠంకు వెళ్లే ప్రధాన రహదారులు, ముఖద్వారం వద్దకు ఆటోలకు అనుమతిలేకపోయిన ఎక్కడపడితే అక్కడ ఆటోలను నిలిపి భక్తులను ఎక్కించుకోవడం, అద్దె మాట్లాడుకుంటూ ఉండటంతో ట్రాఫిక్‌కు ఇబ్బందికరంగా మారింది. లాడ్జీలు, హోటళ్ల పార్కింగ్‌కు స్థలాలు లేకపోవడంతో యజమానులు ప్రధాన రహదారులకు ఇరువైపుల పార్కింగ్ చేయించడంపై భక్తులు మండిపడుతున్నారు. ఆర్‌టీసీ బస్‌స్టాండ్, ఉన్నతపాఠశాల, సంతమార్కెట్, హెల్త్‌క్లీనిక్ మైదానం, తాహసీల్దార్ కార్యలయం ముందు, రాఘవేంద్రసర్కిల్ నుంచి మూడురోడ్ల దాదాపు రెండు కి.మీ. రోడ్డుకు ఇరువైపుల వాహనాలు పార్కింగ్ చేయడంతో ఆయా కార్యలయాలకు ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా కబ్జాకు గురైన



శ్రీమఠానికి వెళ్లే రోడ్‌లో నిలిచి పోయిన వాహనాలు

అర్‌అండ్‌బీ, పంచాయతీ రోడ్లు, ప్రైవేట్ లాడ్జీలు, హోటళ్లకు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసేవిధంగా అధికారులు చర్యలు తీసుకుని పోలీసు అధికారులకు సహకరించాలని, ట్రాఫిక్ వ్యవస్థను చక్కదిద్ది, ఆటోలను నియంత్రించి ట్రాఫిక్ అంతరాయాన్ని పరిష్కరించాలని భక్తులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి



మంత్రాలయంలో భక్తులు ఇబ్బంది పడకుండా ట్రాఫిక్ నియంత్రణకు అందరూ బాధ్యతగా సహకరించాలి. కబ్జాకు గురైన ఆర్‌అండ్‌బీ రోడ్లలో పానీపూరీ, టీకొట్లు, సోడాబండ్లు, టిఫిన్ సెంటర్లు తొలగించాలి. ప్రైవేట్ లాడ్జీలు, హోటళ్లు పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటుచేసుకుని ట్రాఫిక్‌కు సహరించాలి. ముఖ్యంగా సెలవురోజుల్లో భారీ వాహనాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటాం. అదనపు సిబ్బందిని నియమించి ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారిస్తాం.

● రామాంజులు, సీఐ, మంత్రాలయం

పంటల సాగుపై రైతులకు అవగాహన



మాట్లాడుతున్న శాస్త్రవేత్త స్వర్ణ రోనమ్‌కి

పెద్దకడుబూరు , జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకడుబూరు గ్రామంలో రైతులకు సాగుపై బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త స్వర్ణరోనమ్‌కి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలలో ముఖ్యంగా కొర్ర, జొన్నలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, విలువ ఆధారిత ఉత్పత్తుల గురించి వివరించారు. అలాగే పత్తి, వేరుశనగ, మిరప్ప, ఉల్లి సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, ఆ పంటల సంరక్షణ గురించి తెలియజేశారు. కేవీకేలో రైతులకు అధిక దిగుబడి ఇచ్చే కంది, కొర్ర విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే భూసార పరీక్షకు మట్టిని ఎలా సేకరించాలనే విషయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ సుజాతమ్మ, చందన, భార్గవి, రామాంజనేయులు, టీడీపీ నాయకులు దశరథరాముడు, లక్ష్మన్న, నరసన్నలు పాల్గొన్నారు.

సమ్మెకు సంఘీభావం తెలిపిన వైసీపీ



సంఘీభావం తెలుపుతున్న వైసీపీ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు వేతనాలు మరియు న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నారాయణ డిమాండ్ చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు 35వ రోజు సమ్మె కొనసాగించారు. మొదటగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ కార్యాలయం నుంచి తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని నినాదాలు చేసుకుంటూ వెళ్ళి తహసీల్దారు శేషాఫణికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట కూర్చోని తమ నిరసన తెలిపారు. మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ సమ్మెకు వైసీపీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్, మాజీ టౌన్ బ్యాంక్ ఛైర్మన్ రాజశేఖర్‌లు మాట్లాడుతూ కనీస వేతనం, ప్రభుత్వ పథకాలు వర్తింపచేయాలని, 15సంవత్సరాల సర్వీస్ కలిగినవారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటేశులు, నరసింహులు, కేసన్న, రాజేంద్ర, నరసప్ప, విజయ్‌కుమార్, శ్రీరాములు, పంపాపతి, సాయి, విజయ్, భాషా, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

నందవరం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి అడ్మిషన్లు చేయించుకుంటున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఆర్‌యూఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు రఘునాథ్, ఆర్పీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షాహిద్ అఫ్రీద్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎంఆర్సీ భవనంలో ఎంఈవో రామాంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో ఉన్న వాహనాలకు ఫిట్‌నెస్ లేకుండా పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకోవడం దారుణమన్నారు. మౌలిక సదుపాయాలు లేకున్నా డొనేషన్లు, పుస్తకాలతో కలిపి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించాలని లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మనోజ్, మహేష్, నవీన్ పాల్గొన్నారు

రాఘవరాయడికి స్వర్ణ కవచ సమర్పణ సేవ



బంగారు కవచంతో అలంకరించిన దృశ్యం

మంత్రాలయం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవ్రేంద స్వామి మూల బృందావనానికి బంగారు కవచం సమర్పణ సేవ రమణీయంగా చేశారు. .మంగళవారం చతుర్దశి శుభదినాన్ని పురస్కరించుకుని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీస్సులతో మఠం పండితులు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగుళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో చూడ ముచ్చటగా అలంకరించారు. ఇది భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

శ్రీమఠానికి రూ.5 లక్షలు, బంగారు బృందావనం విరాళం

బెంగళూరుకు చెందిన నళిని శ్రీవత్స అనే భక్తురాలు రూ.5 లక్షలు అభివృద్ధి పనులకు, బెంగళూరుకు చెందిన సుజాత అనే మరో భక్తురాలు 31 గ్రాముల బంగారుతో బృందావనం తయారు చేయించి విరాళంగా ఇచ్చినట్లు మేనేజర్లు తెలిపారు. మంగళవారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని రూ. 5 లక్షలు చెక్ రూపంలో, బంగారుతో సుందరంగా రాఘవేంద్రస్వామి బృందావనంను విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాతల కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీస్సులతో పండితులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జేపీ స్వామి, నరసింహ దేశాయ్, శ్రీపాధ ఆచార్‌లు పాల్గొన్నారు.

మంచాలమ్మకు సుగంధ ద్రవ్యాలతో విశేషాభిషేకం

గ్రామదేవత మంచాలమ్మ దేవతకు సుగంధ ద్రవ్యాలతో విశేషాభిషేకం నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైన మంగళవారం జ్యేష్ఠ మాస చతుర్దశి శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

టీడీపీవి డైవర్షన్ రాజకీయాలు : వైసీపీ

ఎమ్మిగనూరు,జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా, రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టలేక ప్రజల దృష్టిని మరల్చేందుకు టీడీపీ డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని వైసీపీ రైతువిభాగం అధికారప్రతినిధి గడ్డం నారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని హెచ్‌బీఎస్‌కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయటం పత్రికా రంగాన్ని అణగదొక్కడమేనన్నారు. అధికారపార్టీ రాజ్యాంగాన్ని అమలు చేయకుండా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తుండటం దారుణమన్నారు. దీన్ని ప్రజలు గమనిస్తున్నారని, ఇది అధికారపార్టీ నాయకులు తెలుసుకోవాలన్నారు.

పాఠశాలకు చేరిన సన్నబియ్యం

మంత్రాలయం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు సన్నబియ్యం అందించాలని ఆదేశాలు రావడంతో ఆయా పాఠశాలలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు ఎంఈవోలు మైనుద్దీన్, రాగన్నలు తెలిపారు. గురువారం పాఠశాలలు వేసవి సెలవుల అనంతరం పునఃప్రారంభం కావడంతో 12వ తేదీ నుంచి పాఠశాలల్లో మధ్యాహ్నం సన్నబియ్యంను మండలంలోని 48 పాఠశాలలకు విద్యార్థుల సంఖ్యను బట్టి బియ్యాన్ని పాఠశాలలకు చేర్చారు. సన్నబియ్యం పంపిణీ చేస్తుండటంతో పక్కదారి పట్టకుండా హెచ్ఎంలు, ఉపాధ్యాయులు జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు నరసన్నగౌడు, బంగారప్ప, భీమేష్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

కోసిగి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఏరువాక పౌర్ణమి వేడుకలు మండల కేంద్రమైన కోసిగితో పాటు చింతకుంట, పల్లెపాడు, డి.బెళగల్ గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని కోసిగి ఎస్ఐ హనుమంతరెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని చింతకుంట, పల్లెపాడు గ్రామాల్లో గ్రామస్థులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం జరుపుకునే ఏరువాక పౌర్ణమి సందర్భంగా సంప్రదాయాలను గౌరవిస్తూ అల్లర్లకు తావు లేకుండా వేడుకలు జరుపుకోవాలన్నారు, కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్స్ మల్లికార్జున స్వామి, శ్రీనివాసులు, నజీర్, శ్రీనివాసులు, మునిస్వామి, ప్రజలు ఉన్నారు.

మంత్రాలయం:

రాజకీయాలకు అతీతంగా గ్రామాల్లో అల్లర్లు లేకుండా అందరు కలసిమెలసి ఏరువాక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరుపుకోవాలని, ప్రశాంతంగా ఉండాలని, అది చూడాల్సిన బాధ్యత గ్రామస్తులతో పాటు ఎస్ఐ, సీఐ లపై ఉందని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు అన్నారు. ఎస్ఐ శివాంజల్, సర్పంచ్ బెస్త అంజినేయులు, ఎంపీటీసీ రామాంజినేయులు, వీరనాగుడు, నాగేష్, హనుమంతు పాల్గొన్నారు.

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు



కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు,జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్‌టీకే ఫ్యాన్స్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రముఖ సినీనటుడు, హిందుపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అభిమానులు ఏర్పాటుచేసిన కేక్‌ను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నటనలో, ప్రజాసేవలో తిరుగులేని వ్యక్తిగా బాలకృష్ణ ఖ్యాతి సంపాదించుకున్నారన్నారు. తల్లిపేరిట బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ఏర్పాటు చేసి ఎంతో మంది పేదలకు వైద్యసేవలు అందిస్తున్న మహానీయుడన్నారు. కార్యక్రమంలో అభిమానులు మహేంద్రబాబు, రంగస్వామిగౌడ్, టీ చంద్ర, తెలుగురాముడు, రమేష్, బుగుడే నాగరాజు, జయన్న, బచ్చాల రంగన్న, మార్కెట్ కమిటీ ఛైర్మన్ కురువ మల్లయ్యలు పాల్గొన్నారు.

● **కమ్మ సంఘం ఆధ్వర్యంలో:** పట్టణంలోని అమరావతి లాడ్జ్‌లో మంగళవారం కమ్మసంఘం ఆధ్వర్యంలో బాలకృష్ణ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఏర్పాటు చేసిన కేక్‌ను సంఘం పెద్దలు, టీడీపీ నాయకులు భాస్కర్ల చంద్రశేఖర్ కట్ చేసి అభిమానులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ మల్లయ్య, ఎన్బీకే ఫ్యాన్స్ కమ్మ సంఘం గౌరవాధ్యక్షులు మహేంద్రబాబు, అధ్యక్షుడు గుంటుపల్లి బాస్కర్, సభ్యులు నరసింహారావు, వీరేష్ చౌదరి, సురేష్ చౌదరి, జగదీష్, శేఖర్, ప్రహ్లాదరావు, మాధవ్,, టీడీపీ నాయకులు మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు, అల్తాఫ్, సోగనూరు జగదీష్ పాల్గొన్నారు.

పార్టీకి నష్టం కలిగించేలా మాట్లాడటం సరైందికాదు



మాట్లాడుతున్న నందవరం మండల టీడీపీ నాయకులు

ఎమ్మిగనూరు,జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పార్టీలో ఉంటూ పార్టీకి నష్టం కలిగించేలా టీడీ పీ జిల్లా ఉపాధ్యక్షులు మాధవరావు దేశాయ్ మాట్లాడటం సరైంది కాదని.. ఏమైనా సమస్యలు ఉంటే ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డితో చర్చించి పరిష్కరించుకోవాలని టీడీపీ నందవరం నాయకులు కాశీం వలి, నాగరాజు గౌడ్, ముగతి ఈరన్న గౌడ్, రైస్‌మిల్లు నారాయణ రెడ్డి, చిన్న రాముడు, ధర్మాపురం గోపాల్, మార్కెట్ కమిటి ఛైర్మన్ కురువ మల్లయ్యలు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ఆవరణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్టీకి రాజీనామా చేస్తున్నానని, తమ సలహాలు ఇవ్వాలంటూ పత్రికలకు ఇవ్వటం.. సోషల్ మీడియాలో వీడియోలు విడుదల చేయటం శోచనీయమన్నారు. తమ అందరి అభిప్రాయం ప్రకారమే ఎమ్మెల్యే బీవీ , కురువ మల్లయ్యకు మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవి ఇవ్వటం జరిగిందన్నారు. ఇదిలా ఉండగా విలేకరుల సమావేశం ముగిసిన తరువాత హాలహర్వి గ్రామానికి చెందిన నాయకులు మాటా మాటా పెరిగి బాహా బాహికి దిగేందుకు ప్రయత్నించగా తోటి నాయకులు అడ్డుకొని ఇరువురిని శాంతింపజేశారు. సమావేశంలో నందవరం మండల నాయకులు బండేగురుస్వామి, జబ్బార్, బ్రహ్మానందరెడ్డి, రామకృష్ణారెడ్డి, సుధీర్, దావీదు, ఈరన్న, చంద్ర, నాగరాజు, మస్తాన్, గోపాల్, కిషోర్, పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే జరిమానా

మంత్రాలయం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పోలీస్ స్టేషన్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 9 మందికి ఎమ్మిగనూరు కోర్టు ఒక్కొక్కరికి రూ.1000లు జరిమానా విధించినట్లు మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 9 మందిపై కేసులు నమోదు చేసి మంగళవారం ఎమ్మిగనూరు కోర్టులో హాజరు పరచగా కోర్టు 9 మంది మందుబాబులకు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరమని, ఇందుకు ఒక్కొక్కరికి రూ.1000లు జరిమానా విధించి తీర్పు ఇచ్చారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, తాగి వాహనాలు, బైకులు నడిపితే కేసులు నమోదు చేసి శిక్షలు వేస్తామని హెచ్చరించారు.